



నేటి నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు

ఏడు వారాల వెంకన్నగా పిలుచుకునే.. వాడపల్లి వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. 18వ తేదీ వరకూ ఉత్సవాలు జరుగుతాయి. ఈ మేరకు ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. 6

బదిలీ టైమ్..

రాజమహేంద్రవరం/చింతూరు/కాకినాడ కలెక్టరేట్/కాకినాడ కార్పొరేషన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా నలుగురు ఉన్నతాధికారులు బదిలీ అయ్యారు. వీరిలో ఇద్దరిని ఇక్కడే సర్దుబాటు చేసేశారు. కాకినాడ జేసీ రాహుల్ మీనా రాజమహేంద్రవరం కమిష నర్‌గా నియమితులయ్యారు.చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ కాకినాడ జేసీగా నియమితులయ్యారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్‌కు చింతూరు బాధ్యతలు అప్పగించారు. కాకినాడ కమిష నర్ భావన బాపట్ల జేసీగా బదిలీ అయ్యారు.

రాజమండ్రి కమిషనర్‌గా మీనా



రాజమహేంద్రవరం కార్పొరేషన్ కమిషనర్‌గా 2021 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి రాహుల్ మీనా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సి పల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.రాహుల్ మీనా ప్రస్తుతం కాకినాడ జాయింట్ కలెక్టర్‌గా ఏడాది పాటు పనిచేశారు. అంతకుముందు ఈయన మార్కాపురం సబ్ కలెక్టర్‌గా కూడా విధులు నిర్వహించారు.రాజమ హేంద్రవరం కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్‌గా కలెక్టర్ కీర్తి చేకూరి ఉన్నారు.

కాకినాడ జేసీగా అపూర్వ భరత్



చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌కు కాకినాడ జాయింట్ కలెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.2021 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన భరత్ 2024 ఆగస్టు 30న చింతూరు ఐటీడీఏ సబ్‌కలెక్టర్, ఐటీడీఏ పీవోగా బాధ్యతలు స్వీకరించారు.ఈ ఏడాది ఆగస్టు 25న శిక్షణ నిమిత్తం ఆయన డెహ్రాడూన్‌కు వెళ్లారు. నవంబరు 25న శిక్షణ పూర్తి కానుంది. భరత్ లక్నోలో గౌతమ్ బుద్ధ టెక్నికల్ యూనివర్శిటీ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ చేశారు.

కాకినాడ కమిషనర్ భావన బదిలీ



కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ భావన బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వం జీవో నెంబర్ 1844 విడుదల చేసింది. 2024 జూలైలో కాకినాడ కమిషనర్‌గా భావన బాధ్యతలు బాపట్ల జాయింట్ కలెక్టర్‌గా భావన బదిలీ అయ్యారు.

చింతూరు సబ్ కలెక్టర్‌గా శుభం నొక్వాల్



రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్‌కు చింతూరు సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవోగా ఎఫ్ఏసీ (ఫుల్ అడిషనల్) బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.దీంతో ప్రస్తుతం శుభం నొక్వాల్ సబ్ కలెక్టర్,ఐటీడీఏ పీవోగా కొనసాగుతారు.



గేదెల పేడ, యూరిన్ పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది.. మాట్లాడుతున్న పశుసంవర్థక శాఖ డీడీ సత్యనారాయణ

పెద్దేవంలో అంతుచిక్కని వ్యాధి

ఆగని గేదెల మరణాలు.. మూడో సారి మళ్లీ పరీక్ష

తాళ్లపూడి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దేవం గ్రామంలో గేదెలకు సోకిన వ్యాధి అంతుచిక్కలేదు.. నేటికీ గేదెలు మృతిచెందుతూనే ఉన్నారు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడో విడతగా గురువారం అనారోగ్యంతో మృత్యువాత పడుతున్న గేదెలకు మరికొన్ని పరీక్షలు నిర్వహించారు. గేదెల పేడ, మూత్రానికి పరీక్షలు చేశారు. పశు సంవర్థక శాఖ డీడీ డా. ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామంలో 50 మంది రైతులు వారి గేదెలకు పరీక్షలు చేయించగా 90 శాతం గేదెల్లో పొట్ట జలగ వ్యాధి ఉన్నట్లుగా గుర్తించామని తెలిపారు. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు మృత్యువాత పడిన గేదెకు పోస్టుమార్టం నిర్వహించి జరిపిన పరీక్షల్లో రెండు వైరస్‌లు గుర్తించినట్లు తెలిపారు. గ్రామంలోని సుగంధి చెరువులో ఉన్న విషపూరిత అవశేషాల కారణంగా గేదెల్లో వ్యాధి నిరోధకశక్తి నశించి వైరస్ పెరుగుతుందన్నారు. వ్యాధి సోకిన గేదెలకు మిశ్రమ రోగాల నివారణకు మందులిస్తున్నామన్నారు. గ్రామ ఉప సర్పంచ్ తోట రామకృష్ణ మాట్లాడుతూ గేదెలకు రోగ నిర్ధారణ చేసి సరైన మం దులు ఇవ్వాలన్నారు.ప్రభుత్వం గేదెలు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఏడీ డా.వెంకటరెడ్డి, కాకినాడ ల్యాబ్‌కి చెందిన డా.సందీప్, డా వెంకటేశ్వరరావు, డా ఎస్.వరలక్ష్మి పాల్గొన్నారు.

పరాన్నజీవులు.. వైరల్ ఇన్ఫెక్షన్ కారణం : కలెక్టర్

రాజమహేంద్రవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పెద్దేవం గ్రామంలో పాడిడేదెలు మృతికి పరాన్నజీవులు, వైరల్ ఇన్ఫెక్షన్ల సమ్మేళనమే కారణమని పరీక్షల్లో గుర్తించినట్టు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు.ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుల చేశారు. గేదెల ఆకస్మిక మృతిపై జిల్లా యంత్రాంగం సమగ్ర పరిశీలన చేసి, పశుసంవర్థక శాఖ నిపుణుల బృందాలు క్షేత్ర పరిశీలన చేసి నిర్వహించిన నమూనాలను ప్రయోగశాలలో పరిశీలన చేయించినట్టు తెలిపారు. బాధిత పశువులకు అవసరమైన వైద్య సహాయం, డీ వార్మింగ్, కీటక నియంత్రణ చర్యలు ప్రారం భించినట్టు చెప్పారు. గ్రామంలోని అన్ని పశు వులకు ఉచిత వైద్యం, సలహాలు అందించేందుకు మొబైల్ వెటర్నరీ టీమ్‌లను పంపినట్టు చెప్పారు.రైతులు తమ పశువుల్లో అనారోగ్య లక్షణాలు గమనించిన వెంటనే సమీప వెటర్నరీ డాక్టర్లకు గానీ, గ్రామ సచివాలయ సిబ్బందికి గానీ సమాచారం ఇవ్వాలని సూచించారు. చెరువులు, బురద ప్రాంతాల్లో పశువులను మేపవద్దని, గొర్రెలు, మేకలతో కలిపి మేపవద్దని.. జిల్లా పశుసంవర్థక అధికారి టి.శ్రీనివాస్ తెలిపారు.



మీ సమస్యలన్నీ పరిష్కరిస్తా..

ఇదే నా ఆన!

ఉప్పాడ సభలో మాట్లాడుతున్న పవన్

ఉప్పాడ సభలో డిప్యూటీ సీఎం పవన్

- వంద రోజులు గడువు ఇవ్వండి
- పారిశ్రామిక కాలుష్యంపై ఆడిట్
- మత్స్యకారుల ఆవేదనకు బాధపడ్డా
- అందుకే మీ ముందుకు వచ్చా
- మీకు న్యాయం చేస్తా
- పవన్ హామీతో ఆనందం

(కాకినాడ,యు.కొత్తపల్లి,పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

మత్స్యకారుల సమస్యలను వంద రోజుల్లో పరిష్కరిస్తామని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు.పిఠాపురం నియోజకర్గం యు.కొత్తపల్లి మండలం ఉప్పాడలో పవన్‌కల్యాణ్ గురువారం సాయంత్రం బహిరంగ సభలో ప్రసంగించారు. సముద్రంలో కలుస్తున్న పారిశ్రామిక వ్యర్థ జలాలు ఏ మేరకు ఉన్నాయనే దానిపై ఆడిట్ చేయడానికే వంద రోజుల గడువు అని తెలిపారు. నాలుగు రోజులు ధర్నా చేస్తే ఐదో రోజే పరిష్కారం అవదని.. మ త్స్యకారులు అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేను మీలో ఒకడిని..

తాను డిప్యూటీ సీఎం..పిఠాపురం ఎమ్మెల్యేను కాదని..మత్స్యకారుల్లో ఒకడినని పవన్ సభలో పేర్కొనడంతో చప్పట్లు మార్మోగాయి.మత్స్యకారులంటే నాకు అభిమానం, ప్రేమ. మిమ్మల్ని ఎగదోసి పబ్బం గడుపుకునే నాయకులను మాత్రం నమ్మవద్దన్నారు.ఉప్పాడ కొత్తపల్లి మండలంలో మత్స్యకారులు కొంతకాలం కిందట నాలుగు రోజులు ధర్నాలు, ఆందోళనలు చేసిన విషయం తన దృష్టికి వచ్చిందన్నారు.మత్స్య సంపద అంతరించిపోతుందనే వారి ఆవేదన తనకు బాధ కలిగించిందన్నారు.అందుకే సమస్య పరిష్కారానికి ఏం చేయాలనేదానిపై అధికారులు, అన్ని పార్టీలు, మత్స్యకార సంఘాల నాయకులతో కలెక్టరేట్‌లో గురువారం ఉదయం సమావేశమై చర్చించినట్టు వివరించారు. ఆరోగ్యం బాగోలేక వెంటనే రాలేకపోయానని..ఈ నెల 10న వస్తానని చెప్పినా ప్రజల కోసం ఒకరోజు ముందుగానే వచ్చానన్నారు. మత్స్య కార సంఘాల నేతలు తన దృష్టికి తెచ్చిన సమస్యలను పవన్ కల్యాణ్ సభలో ఒక్కొక్కటిగా వివరించారు. నక్కపల్లి,కాకినాడ సెజ్‌లు, దివీస్, అరబిందో, డెక్కన్ తదితర పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యంవల్ల వేట దొరకడం లేదని మత్స్యకారులు తెలిపారని, ఇవి కాంగ్రెస్ ప్రభు త్వంలో వచ్చాయన్నారు.ఈ కాలుష్యం ఏ స్థాయిలో ఉందనేది మత్స్యకా రులు తనకు వివరించారని..అందుకే మూడు రోజుల్లో కాకినాడ పోర్టు నుంచి సముద్రంలోకి వెళ్లి కాలుష్యం జాడలను పరిష్కరిస్తానని పవన్ హామీ ఇచ్చారు.అమీనాబాద్ హార్బర్ డిజైన్ లోపం వల్ల పడవలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్న విషయమై సమస్య పరిష్కరిస్తామన్నారు. స్థానికంగా మత్స్యసంపద దొరకనప్పుడు అంత ర్వేది, మచిలీపట్టణం, నిజాంపట్నం తదితర ప్రాంతాలకు వేటకు వెళ్తే ఇబ్బంది పెడుతున్నారన్న విషయమై ఇప్పటికే మంత్రి కొల్లు రవీంద్ర,రాజోలు ఎమ్మెల్యేతో చర్చించగా, సమస్య పరిష్కారమైందన్నారు.ఇక నుంచి ఉప్పాడ మత్స్యకా రులు వేటకు అటువైపు వెళ్ల వచ్చని ప్రకటించారు.రింగుల వలలు వాడొద్ద న్నారు. ఎన్ని ఇబ్బందులు పడినా ఉప్పాడ రక్షణ గోడ నిర్మించడం తథ్యం అన్నారు. ఉప్పాడ-కోనపాప పేట తీర ప్రాంతంలో రూ.5.72 కోట్లతో రహదారులు నిర్మిస్తున్నామన్నారు. పది రోజుల కోసారి డిప్యూటీ సీఎం కార్యాలయం, కూటమి నాయకులు ద్వారా ఎప్పటికప్పుడు జరుగుతున్న విషయాలను తెలియజేస్తారన్నారు.



చూడండి సార్ : పవన్‌తో మాజీ ఎమ్మెల్యే వర్మ

పర్యటన సాగిందిలా..

ఉదయం 10:30 గంటలకు పవన్ హెలీకాప్టర్‌లో కాకినాడ పోలీసు పరేడ్ గ్రౌండ్‌కు చేరుకున్నారు.అక్కడి నుంచి 11.30 గంటలకు కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. అనంతరం 2.30 గంటలకు జీఆర్టీ హోటల్‌కు చేరుకుని పార్టీ నేతలతో ముచ్చటించారు. సాయంత్రం ఉప్పాడలో సభ ముగించుకుని హెలీకాప్టర్‌లో రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకుని తిరిగి వెళ్లారు.



కలెక్టరేట్‌లో మత్స్యకార సమస్యలపై చర్చిస్తున్న పవన్, కలెక్టర్ షాన్‌మోహన్, ఎంపీ ఉదయ్ తదితరులు



నిబంధనలు గాలికి..

ప్రాణాలు బుగ్గికి!

అధికారులకు పట్టని ఉల్లంఘనులు

- అక్రమంగా బాణసంచా కేంద్రాలు
- పట్టించుకోని అధికారులు
- తూతూమంత్రంగా దాడులు
- రాయవరం ఘటనతో ఉలికిపాటు
- ప్రత్యేక బృందాల ఏర్పాటు
- అధికారులతో కలెక్టర్ సమీక్ష

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

బాణసంచా తయారీ, విక్రయాల్లో నిబంధనల ఉల్లంఘనలు జరుగుతున్నా సంబంధిత ప్రభుత్వ శాఖలకు కానరావడంలేదు.. మామూళ్ల మత్తులో అధికారులు తనిఖీలకు దూరమవడంతో ప్రతీ ఏడాది దీపావళికి ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కుటుంబాలను చిన్నాభిన్నమవుతున్నాయి.అయినా అధికారులు చేపట్టే చర్యలు మాత్రం శూన్యం. జిల్లాలోని చాగల్లు, బిక్కవోలు మండలం కొమరిపాలెం తదితర ప్రాంతాల్లో బాణసంచా తయారీ కేంద్రాలు ఉన్నాయి. సొంతంగా తయారుచేసి విక్రయిస్తారు. అంతా తెలిసినా అధికారులకు మాత్రం పట్టడంలేదు. తూతూమంత్రపు తనికీలతో తుస్‌మనిపిస్తున్నారు. ప్రమాదాలు జరిగిగే బతుకులు బాంబుల్లా పేలిపోతున్నాయి. బుధవారం జరిగిన సంఘటనే అందుకు ఒక ఉదాహరణ. ఒక చిన్న చిచ్చుబుడ్డి కారణంగా ఏడుగురు బతుకులు బుగ్గిపాలయ్యాయి. అయినా అధికారుల్లో మాత్రం నేటికీ పూర్తి చలనం లేదు.

జిల్లాలో 11 లైసెన్స్‌డ్ కేంద్రాలు..

తూర్పుగోదావరి జిల్లాలో 11 మంది ఏడాది పొడవునా తయారు చేసే లైసెన్సులు కలిగి ఉన్నారు. వీళ్ల ఆర్డరుపై మాత్రమే తయారు చేసి విక్రయించాలి. దుకాణాలకు అమ్మకూడదు. ఈ కేంద్రాలు జనావాసాలకు కచ్చితంగా దూరంగా ఉండాలి. క్రాకర్ తయారీ, విక్రయ కేంద్రాలను పోలీస్, రెవెన్యూ, ఫైర్ శాఖల సిబ్బంది ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలి. కానీ ఎవరికి వారే యమునాతీరే అనే విధంగా పరిస్థితులు ఉన్నాయి. దీపావళి సమీపిస్తున్నా కనీసం ప్రజలకు అవగాహన కల్పించడంపై కూడా దృష్టి సారిం చడంలేదు. ఫ్యాక్టరీస్ డిపార్ట్‌మెంట్ సేఫ్టీ నిబంధనలు కఠినంగా ఉంటాయి. కానీ మందు గుండు సామగ్రి తయారీ కేంద్రాలు తమ పరిధిలోకి రావంటూ ఆ శాఖాధికారులు చేతులు కట్టుకొని చూస్తున్నారు.నిబంధనల ప్రకారం దీపావళి టపాసులు తయారు చేసి విక్రయించ డానికి వీల్లేదు.వేరే రాష్ట్రాల నుంచి హోల్‌సేల్‌గా తెచ్చుకున్న వాళ్ల దగ్గర నుంచి రిటైల్ వ్యాపా రులు కొనుగోలు చేసుకుని విక్రయించాలి.ఎవరికీ ఇవేమీ పట్టడం లేదు. ఎంత ముడి సరుకు తీసుకొస్తున్నారు. ఏమి తయారు చేస్తున్నారు. ఎవరికి విక్రయిస్తున్నా రనే అంశాలపై నిఘా కొరవడింది.ఏడాది పొడవునా తయారు చేయడానికి లైసెన్సు తీసుకున్న వాళ్లు 15 కిలోలకు మించి తమ వద్ద ముడి సరుకు నిల్వ ఉంచకూడదు. షెడ్లను సిమెంటు రేకులతో 45 మీటర్ల దూరం ఉండే విధంగా నిర్మించుకోవాలి. వీటికి కరెంటు కనెక్షన్ ఉండకూడదు. రాత్రి వేళల్లో పని చేయ కూడదు. నీళ్లు తోడుకోవడం తదితర అవస రాలకు డీజిల్ జనరేటర్‌ని వాడాలి. కార్మికులు లూజుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి. దూరంగా కూర్చొని క్రాకర్స్ తయారు చేయాలి. ఎవరైనా ప్రాణాలు కోల్పోయిన తర్వాత హడావుడి చేస్తూ నివేదికలతో చేతులు దులుపుకుంటున్నారు.

తనిఖీలకు బృందాలు



అనుమతులు ఉన్నవాళ్లు నిబంధనలకు లోబడి వ్యాపారాలు చేయాలి. అక్ర మంగా తయారు చేసినా,నిల్వ ఉంచినా, విక్రయాలు జరిపినా క్రిమినల్ కేసులు తప్ప వు.జిల్లావ్యాప్తంగా ప్రతి రోజూ ఆకస్మిక తని ఖీలు చేయడానికి బృందాలను ఏర్పాటు చేశా ం. అక్రమ తయారీ, నిల్వ, విక్రయాలపై 112కి సమాచారం ఇవ్వాలని కోరారు. అవసరమైతే వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. - కిశోర్‌కుమార్, ఎస్పీ

నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు: కలెక్టర్



రాజమహేంద్రవరం,అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బాణాసంచా తయారీ, అమ్మకాల్లో నిబంధనలు కచ్చితంగా పాటించాలని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. బాణసంచా తయారీదారుల సంఘాల ప్రతినిధులు,సమన్వయ శాఖల అధికారులతో గురువారం కలెక్టర్ సమీక్షించారు. ప్రమాదాలకు తావులేకుండా పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టాలని..నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నిశిత పరిశీలన తర్వాతే అనుమతులు మంజూరు చేయాలన్నారు. అనుమ తుల్లేకుండా నిర్వహిస్తుంటే చర్యలు తీసుకోవాలని సూచించారు.రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖల అధికారులు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేయాలన్నారు.కార్యక్రమంలో జేసీ మేఘస్వరూప్, అదనపు ఎస్పీ మురళీకృష్ణ,డీఆర్వో సీతారామ మూర్తి, ఆర్డీవోలు కృష్ణ నాయక్, రాణి సుస్మిత, డీఎస్పీలు దేవకు మార్, భవ్య కిషోర్, జిల్లా ఫైర్ ఆఫీసర్ మార్టిన్ లూథర్ కింగ్, ఏఎల్‌సీ వలీ పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో ఆర్థిక లాభం

ఫిర్యాదులుంటే డయల్ 1800 1200 232

డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

దివాన్‌చెరువు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 సంస్కరణలతో మందులు, వైద్య పరికరాలు, బీమా ప్రీమియంలపై పన్ను తగ్గడం ద్వారా ప్రజలకు గణనీయమైన ఆర్థిక లాభం కలుగుతుందని డీఎంహెచ్‌వో డాక్టర్ కె. వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రాజానగరం మండలం పాలచర్ల పీహెచ్‌సీలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహనకు గురువారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. మందులపై పన్ను రద్దు చేయడం, వైద్యసేవలపై జీఎస్టీ తగ్గించడం ప్రజలకు ఊరట కలిగించే నిర్ణయాలన్నారు. జీఎస్టీ 2.0కు సంబంధించిన ఫిర్యాదులను తూర్పుగోదావరి జిల్లా కంట్రోల్‌రూమ్ నెంబరు 87126 31290, టోల్ ఫ్రీ నెంబరు 1800-1200-232, వాణిజ్య పన్నుల శాఖ 0866- 2821183 నెంబరుకు తెలుపవచ్చునన్నారు. వినియోగదారుల బిల్లుల్లో జీఎస్టీ తగ్గింపులు అమలు కాకపోవడం, అధిక పన్నుల వసూలు వంటి అంశాలపై ఫిర్యాదు చేయాలంటే 1915కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కోమలి, పాలచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బెనడిక్ట్, నాయకులు గంగిశెట్టి చంటిబాబు, గంగిశెట్టి వసంతరాయుడు, రాజేంద్ర ప్రసాద్, బిందుశేఖర్ పాల్గొన్నారు.



ఇస్తినమ్మా వాయినం..



రాజమహేంద్రవరం పుష్కరఘాట్ గురువారం మహిళలతో కిటకిటలాడింది.. అట్లతద్ది సందర్భంగా గోదావరి రేవులో పెద్ద ఎత్తున పూజలు చేశారు.. గోదావరిలో దీపాలు వదిలారు.. ముత్తయిదువులకు ఇస్తినమ్మా వాయినం.. పుచ్చుకుంటినమ్మా వాయినం అంటూ ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు..

- రాజమహేంద్రవరం సిటీ

ఎందరో ప్రముఖుల ప్రశంసలు అందుకుని కర్ణాటక సంగీతం, అన్నమాచార్య కీర్తనల ద్వారా దేశ, విదేశాల్లో ప్రాచుర్యం పొందిన ఆయన చేసిన కచేరీలు, ఆలపించిన కీర్తనలు కళాభిమానుల చెవుల్లో ఇంకా ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. అన్నమాచార్యుల కృతులకు బాణీలు కట్టి, కర్ణాటక సంగీతానికి వన్నెలద్దిన 'సంగీత కళానిధి', ప్రముఖ సంగీత విద్వాంసుడు నేదునూరి కృష్ణమూర్తి జయంతి శుక్రవారం జరగనున్నది. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యే కథనం.



సంగీత కళానిధి నేదునూరి

కర్ణాటక సంగీతానికి వన్నెలద్దారు

అన్నమాచార్యుల కృతులకు బాణీలు.. నేడు కృష్ణమూర్తి జయంతి

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

పిఠాపురం మహారాజా ఎస్టేట్‌లో పనిచేసిన నేదునూరి శ్రీరామమూర్తిపంతులు-విజయలక్ష్మి దంపతులకు కృష్ణమూర్తి 1927 అక్టోబరు 10వ తేదీన జన్మించారు. (ఈయన కొత్తపల్లిలో జన్మించినప్పటికీ పిఠాపురాన్ని జన్మస్థలంగా చెబుతారు) తన తల్లి, మేనమామ ద్వారా సం గీతంపై ఆసక్తి పెంచుకున్న ఆయన 1940లోనే విజయనగరంలోని మహారాజా మ్యూజికల్ కళాశాలలో వయొలిన్, సంగీతం నేర్చుకున్నారు. తొలుత ద్వారం నరసింగరావునాయుడు వద్ద, తదనంతరం పద్మభూషణ్ శ్రీపాద పినాకపాణి ద్వారా సంగీతాన్ని పూర్తిగా అవపోశన పట్టారు. ఆల్ ఇండియా రేడియోలో అగ్రగణ్య కళాకారుడిగా గుర్తింపు పొందారు. 1945లో 18 ఏళ్ల వయసులోనే పలు సంగీత ప్రదర్శనలు ఇచ్చారు. 1950 వరకు పిఠాపురంలోనే నివసించిన ఈయన తర్వాత ఇక్కడి నుంచి వెళ్లి విశాఖపట్నంలో స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. ఆయన మద్రాసు మ్యూజిక్ అకాడమీలో ఐదు దశాబ్దాలకు పైగా సంగీత కచేరీలు నిర్వహించారు. తదనంతరం కంచికామకోటి పీఠం, తిరుమల తిరుపతి దేవస్థానం, విజయవాడ కనకదుర్గమ్మవారి దేవస్థానంలో ఆస్థాన విద్వాంసులుగా పనిచేశారు.

ఒక్క కీర్తనకే సంగీత కళానిధి ఇవ్వొచ్చు

నానాటి బతుకు నాటకము... అన్నమాచార్య కీర్తనకు నేదునూరి కృష్ణమూర్తి కట్టిన బాణీని ఆలకించిన ప్రముఖ గాయకురాలు ఎంఎస్ సుబ్బులక్ష్మి ఈ ఒక్క పాటకు బాణీ కట్టినందుకు మీకు సంగీత కళానిధి ఇవ్వవచ్చు అంటూ చేసిన ప్రశంస నేదునూరి ప్రతిభకు అద్దంపట్టింది. దేశ, విదేశాల్లో నేదునూరి చేసిన అన్నమాచార్య సంకీర్తనలు మంచి ప్రాచుర్యం పొందాయి. అనేక అన్నమయ్య కృతులకు బాణీలు కట్టారు. వీటితో పాటు ఆయన స్వరపరిచిన కీర్తనల్లో దాశరథి శతకం పద్యాలు, రాగసుధారస, భద్రాచల రామదాసు కీర్తనలు అత్యంత ప్రాచుర్యం పొందాయి. ఆల్ ఇండియా రేడియో భక్తిరంజని కార్యక్రమంలో ఈయన రూపొందించిన నారాయణ తీర్థ తరంగాలు, రామదాసు కీర్తనలు అలరించాయి. ఇవన్నీ సీడీలు, క్యాసెట్ల రూపంలో ఇప్పటికీ అందుబాటులో ఉన్నాయి.



పిఠాపురం పాదగయ క్షేత్రాన్ని సందర్శించిన నేదునూరి కృష్ణమూర్తి (ఫైల్ ఫొటో)

వివిధ హోదాల్లో...

నేదునూరి తొలుత విజయవాడ జీవీఆర్ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రధాన అధ్యాపకుడిగాను, తదనందరం సికింద్రాబాద్, విజయనగరం, తిరుపతి సంగీత కళాశాలల్లో పనిచేశారు. వెంకటేశ్వర, నాగార్జున విశ్వవిద్యాలయాల్లో ఆర్ట్స్ విభాగం డీన్‌గా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, ఆల్‌ఇండియా రేడియో సంగీత విభాగం ఆడిషన్ బోర్డు సభ్యుడిగా వ్యవహరించారు. కొంతకాలం ఆంధ్రవిశ్వవిద్యాలయంలో గౌరవ ఆచార్యుడిగా ఉన్నారు. తాను వయొలిన్, సంగీతం నేర్చుకున్న విజయనగరం కళాశాలలోనే పనిచేయడం తనకు అత్యంత సంతృప్తి ఇచ్చిందని నేదునూరి చెప్పేవారు.

పురస్కారాల వెల్లువ

నేదునూరికి పలు పురస్కారాలు లభించాయి. 1976లో చెన్నైలోని శ్రీకృష్ణ గానసభ 'సంగీత చూడామణి' అవార్డుతో తొలుత సత్కరించింది. మద్రాసు మ్యూజిక్ అకాడమీ 1991లో 'సంగీత కళానిధి' పురస్కారంతో, 1995లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'కళానీరాజన' పురస్కారంతో, చికాగోలోని నార్త్ అమెరికా అన్నమాచార్య ప్రాజెక్టు 'అన్నమాచార్య విద్వన్మణి, రాష్ట్ర సాంస్కృతిక సమాఖ్య 1999లో హంస అవార్డుతో సత్కరించాయి. 2002లో రాజ్యలక్ష్మి ఫౌండేషన్ ద్వారా రాజ్యలక్ష్మి అవార్డు, 2002లో అభ్యుదయ ఫౌండేషన్ చైర్మన్ బాదం మాధవరావు ద్వారా బాదం అప్పారావు మెమోరియల్ ట్రస్టు అవార్డు, 2010లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా గౌరవ డాక్టరేట్ పొందారు. అనారోగ్యానికి గురయ్యే వరకు ఆయన కీర్తనలను ఆలపించడమే కాదు స్వరపరుస్తూనే ఉన్నారు. 87 ఏళ్ల వయసులో 2014 డిసెంబరు 8న విశాఖపట్టణంలో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణించినా ఆ సుస్వరాలు నేటికీ అందరినోటా వినిపిస్తూనే ఉన్నాయి.

జన్మభూమిపై ఎనలేని మమకారం

నేదునూరి ఎక్కడకు వెళ్లినా పిఠాపురంపై మాత్రం మమకారం వీడలేదు. తనకు జన్మనిచ్చిన గడ్డపై అడుగుపెట్టేందుకు ఆయన తరచూ ప్రయత్నించేవారు. నేదునూరి కృష్ణమూర్తి చిన్నతనంలో ఈయన కుటుంబం పిఠాపురంలోని కోటవారి వీధిలో ఎక్కువ కాలం నివాసముంది. తదనంతరం ఆకొండి వారి వీధిలో ఉన్నారు. ఇప్పుడు వారు నివసించిన గృహాలు శిథిలమవ్వడంతో అక్కడ నూతన గృహాలు వెలిశాయి. అయినప్పటికీ ఆ వీధుల్లో నివసించే వృద్ధుల్లో పలువురికి నేదునూరితో అవినాభావ సంబంధాలు ఉండేవి.

పాదగయపై భక్తి భావం.. జన్మ స్థలం అమ్మఒడి

జీవితచరమాంకంలోనూ నేదునూరి పిఠాపురం పాదగయ క్షేత్రంపై తనకు ఉన్న భక్తిభావాన్ని చాటుకున్నారు. అనారోగ్యంతో ఉన్నప్పటికీ మరణానికి నెలన్నర ముందు పాదగయను కుటుంబసభ్యులతో కలిసి సందర్శించి కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరిపారు. పాదగయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం అందించారు. జన్మస్థలం అమ్మ ఒడి లాంటిదని, పిఠాపురంపై తనకు ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు.



వెరీ గుడ్డు!



గుడ్డుతో పరిపూర్ణ ఆరోగ్యం

నేడు అంతర్జాతీయ గుడ్డు దినోత్సవం

అనపర్తి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): తక్కువ ధరలో ఎక్కువ పోషకాలు లభించే ఏకైక ఆహారం గుడ్డు అనడంలో ఎటువంటి సందేహం లేదు. పేదవారి నుంచి మధ్యతరగతి కుటుంబాల వరకు ఎన్నో రకాల వంటకాలు గుడ్డుతోనే తయారుచేస్తారు. గుడ్డును చౌకగా వచ్చే ఆహారంగానే చూస్తున్నాంగానీ దీని నుంచి లభించే పోషక విలువలు ఎంత ముఖ్యమో ఎంతమందికి తెలుసు. పూర్వం పల్లెల్లో ఇళ్ల వద్దే రైతులు కోళ్లను పెంచడం, తద్వారా వచ్చిన గుడ్లను కుటుంబంలోని సభ్యులు మాత్రమే తినడం, కొన్ని గుడ్లను బంధువులకు పంచడం జరిగేది. కాలక్రమంలో మిగిలిన గుడ్లను వారపు సంతలకు తరలించి విక్రయించడం ద్వారా గుడ్ల అమ్మకాలకు నాందిపలికారు. దేశంలో కోళ్ల పెంపకం ద్వారా గుడ్లను భారీస్థాయిలో ఉత్పత్తి చేయడం చేయడమేకాకుండా పట్టణాల్లో ఉండే వారికి సైతం గుడ్డును అందుబాటులోకి తీసుకురావాలనే బీవీ రావు కోళ్ల పరిశ్రమకు బీజం వేశారు. నాటి నుంచి నేటి వరకు ఈ పరిశ్రమ దినదినాభివృద్ధి చెందుతూ వచ్చింది. ప్రస్తుతం మన రాష్ట్రం నుంచే గుడ్లను దేశ, విదేశాలకు ఎగుమతులు చేసే స్థాయికి పరిశ్రమ చేరుకుంది. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ గుడ్డు ఎగుమతిలో ప్రథమ స్థానంలో నిలవగా, రాష్ట్రానికి ఉమ్మడి తూర్పుగోదావరి కోళ్ల పరిశ్రమకు రాజధానిగా మారడం అందరికీ తెలిసిందే. రాష్ట్రంలోనే ఉత్పత్తి అయ్యే గుడ్లలో సుమారు 50 శాతం మేర ఉత్పత్తి జరగడం ఇక్కడ కోళ్ల పరిశ్రమకు లభిస్తున్న ఆదరణగా చెప్పవచ్చు. అయితే గుడ్ల ఉత్పత్తికి కేంద్రంగా ఉన్న ఉమ్మడి జిల్లాలో గుడ్ల వినియోగం తక్కువగా ఉందనే చెప్పవచ్చు. అయితే గుడ్డులో లభించే పోషక విలువలను ప్రజలకు వివరించి వాటి వినియోగాన్ని పెంచే దిశగా కోళ్ల రైతులు చేస్తున్న కృషి కొనసాగిస్తూనే ఉన్నారు. వాస్తవానికి అనపర్తి ప్రాంతంలో గుడ్లు ఎగుమతిని బట్టే నెక్ గుడ్డు రేటును ప్లస్, మైనస్‌లు చేసుకుంటాయనడంతో సందేహం లేదు. అంతటి కీలకమైన మన ప్రాంతంలో గుడ్ల వినియోగం మరింత పెరగాల్సి ఉంది. ఇక ప్రతి ఏడాది అక్టోబరు నెలలో 2వ శుక్రవారాన్ని నేషనల్ ఎగ్‌డేగా నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ ఎగ్ కమిషన్ 1996లో వియన్నాలో జరిగిన ఒక కాన్ఫరెన్స్‌లో తొలిసారిగా ఈ ఎగ్ డేను జరుపుకోవాలని నిర్ణయించింది. విజయవాడలో నెక్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగే ఇంటర్నేషనల్ ఎగ్ డేకు మన ప్రాంతం నుంచి పలువురు రైతులు తరలివెళుతున్నారు.

ప్రభుత్వం చేయూత

కోడిగుడ్డు ద్వారా కలిగే ప్రయోజనాలను గుర్తించిన ప్రభుత్వం అటు అంగన్వాడీల ద్వారా చిన్నారులకు, గర్భిణులకు, పాఠశాలల విద్యార్థులకు, వసతిగృహ విద్యార్థులకు గుడ్డును ఉచితంగా పంపిణీ చేస్తూ కోళ్ల పరిశ్రమకు తన వంతు చేయూతనందిస్తోంది. పౌష్టికాహారం అందించడం ద్వారా ప్రజలకు చాలా ప్రయోజనం చేకూరుస్తోంది.



పోషక విలువలు వెలకట్టలేం

డాక్టర్ తాడి రామగురెడ్డి, అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్

- కూరగాయలు, పండ్లలో లేని విటమిన్ బి12, విటమిన్‌డి, ఫోలిక్ యాసిడ్ గుడ్డులో లభిస్తాయి. కాలుష్యం వల్ల ఏర్పడే దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు గుడ్డులోని పచ్చసొనలో ప్రత్యేకంగా కాపర్, జింక్, మాంగనీస్, సెలీనియమ్‌లు దోహదపడతాయి.
- మానసిన ఒత్తిడిని తగ్గించేందుకు గుడ్డులోని తెల్లసొనలో హిస్టోడిన్, జింక్, కోలిన్, అయోడిన్, లినోలిక్ యాసిడ్‌లు ఉపయోగపడతాయి.
- ఊబకాయులకు పచ్చసొనలో శరీర సౌష్టవాన్ని కాపాడే విటమిన్‌డి, కొవ్వును కరిగించే కోలిన్ అనే ధాతువు, సెలీనియమ్, బి12లు ఉపయోగపడతాయి.
- మధుమేహ వ్యాధిగ్రస్తులకు గుడ్డులోని తెల్లసొన ద్వారా లభించే ప్రొటీన్‌ప్యాంక్రిస్ ద్వారా గ్రంథిని నిర్మించి జింకు క్రోమీన్ ద్వారా ఇన్సులిన్ క్రియను కలుగజేసి ఎంతో ఉపయోగపడుతుంది.
- కంటిని రక్షించేందుకు గుడ్డులోని విటమిన్-ఏ ప్రధాన జీవపోషకంగా ఉపకరిస్తుంది.
- ఎముకల పటిష్టతకు గుడ్డులోని పచ్చసొనలో అధికంగా ఉండే కాల్షియం ఉపయోగపడుతుంది.

...ఇలా అన్ని రకాల అనారోగ్య సమస్యలకు గుడ్డు ఎంతో ఉపయోగపడడమే కాకుండా ఆరోగ్యవంతులకు ఎన్నో రకాల పోషక విలువలను అందిస్తుంది. గుడ్డులో 96 శాతం కేలరీలు, విటమిన్ ఎ, డి, ఈ, కె. బి6, బి12 క్యాల్షియం, ఐరన్, జింకు, ఫోలైట్, ఫోలిక్ యాసిడ్, పాస్ఫరస్, పొటాషియం, క్లోరిన్, కాపర్, మెగ్నీషియం, సీలియమ్‌లతో పాటు అనేక రకాల విటమిన్లు లభిస్తాయి.



కోళ్ల పరిశ్రమ ద్వారా వేలాది మందికి ఉపాధి

- పడాల సుబ్బారెడ్డి, జనరల్ సెక్రటరీ, ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్



జిల్లాలో కోళ్ల పరిశ్రమ ద్వారా అనేక కుటుంబాలు జీవనోపాధిని పొందుతున్నాయి. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం నుంచి తూర్పుగోదావరి జిల్లాలో గల కోళ్ల పరిశ్రమలకు కూలీలుగా వచ్చిన అనేక మంది ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. అంతేకాకుండా ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగాను, పరోక్షంగాను అనేక కుటుంబాలకు జీవనోపాధి లభిస్తోంది. గుడ్డు విశిష్టతను తెలియజేస్తూ గుడ్డు వినియోగం పెరిగే విధంగా ప్రతి ఏటా అక్టోబరు 2వ శుక్రవారం అంతర్జాతీయ ఎగ్‌డే నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 2.40 కోట్ల గుడ్లు ఉత్పత్తి జరుగుతుండగా, వీటిలో 40 శాతం మేర ఇక్కడ వినియోగిస్తున్నారు.



విద్యుత్ వెలుగుల్లో వాడపల్లి ఆలయం

కోనసీమ తిరుమల వాడపల్లి బ్రహ్మోత్సవ శోభ సంతరించుకుంది. ఈ పుణ్యక్షేత్రం తొమ్మిది రోజుల పాటు వేద ఘోష, మంగళవాయిద్యాలతో పులకించనుంది. గ్రామానికి విచ్చేసే మార్గాలన్నీ స్వాగత ద్వారాలు, విద్యుద్దీపాలంకరణలతో వెలుగొందుతున్నాయి. శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని వసంత, ముఖ మండపాలను ఫల, పుష్పాలు, వివిధ రాష్ట్రాలకు చెందిన వెరైటీ రంగుల పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు.



బ్రహ్మోత్సవ శోభ

- 13వ వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన వాడపల్లి
- శ్రీవేంకటేశ్వరస్వామికి 9 రోజుల పాటు వాహన సేవలు
- తిరుమల తరహాలో విస్తృత ఏర్పాట్లు



ఆత్రేయపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లిలో శ్రీవేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలను శుక్రవారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదచార్యులు బ్రహ్మత్వంలో ఘనంగా నిర్వహించనున్నారు. దీనికి సంబందించి తిరుమల తరహాలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో యాగశాలను సిద్ధం చేశారు. రాష్ట్ర మంత్రులు, జిల్లా అధికారులు, ప్రముఖులకు శుభ పత్రికలను అందజేసి ఆహ్వానించారు. పట్టణాల నుంచి పల్లెల వరకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పాటు ఎల్‌ఈడీలతో డిజిటల్ ప్రచారం చేశారు.

బ్రహ్మోత్సవాల్లో భాగంగా వివిధ వాహనాలపై శ్రీవారు తిరువీధుల్లో విహరించి భక్తులకు కృపాకటాక్షాలు అందించనున్నారు. శుక్రవారం రాత్రి పరావాసుదేవ అలంకరణతో శేషవాహన సేవ, 11వ తేదీ రాత్రి సరస్వతి అలంకరణతో హంస వాహన సేవ, 12న కోదండరామ అలంకరణతో హనుమత్ వాహన సేవ, 13న యోగనారసింహ అలంకరణతో సింహ వాహన సేవ, 14న మలయప్ప అలంకరణతో గరుడ వాహన సేవ, 15వ తేదీ ఉదయం శ్రీకృష్ణ అలంకరణతో సూర్యప్రభ వాహన సేవ, రాత్రి మోహిని అలంకరణతో చంద్రప్రభ వాహన సేవ, 16న రాజాధిరాజ అలంకరణతో గజ వాహన సేవ, 17వ తేదీ ఉదయం కల్పవృక్ష వాహన సేవ, రాత్రి కల్కి అలంకరణతో అశ్వవాహన సేవ జరుగుతాయి. 18న చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయి.

తొమ్మిది రోజుల పాటు మహారాష్ట్ర, కేరళ, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన సుమారు 500 మంది కళాకారులు తమ ప్రదర్శనలతో భక్తులకు కనువిందు చేయనున్నారు.

కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టామన్నారు.



కోనసీమ జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఉప కమిషనరు సూర్యచక్రధరరావు



దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్‌లాల్ దంపతులకు స్వామివారి చిత్రపటం బహూకరిస్తున్న దృశ్యం

ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు

ఆలయ ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు గురువారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, కోనసీమ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్ననాయుడును కలిసి బ్రహోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేశారు. దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్‌లాల్ దంపతులను ఆహ్వానించి స్వామివారి చిత్రపటం అందజేశారు. విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయ ఈవో శీనా నాయక్‌కు కూడా ఆహ్వానం పలికారు.

అన్ని డిపోల నుంచి వాడపల్లికి ప్రత్యేక బస్సులు

రావులపాలెం డిపో మేనేజరు కుమార్



రావులపాలెం (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల నేపథ్యంలో వాడపల్లికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు ఆర్టీసీ రావులపాలెం డిపో మేనేజరు వైవీవీఎస్ కుమార్ తెలిపారు. రావులపాలెం డిపో నుంచి 12, రామచంద్రపురం డిపో నుంచి 3, అమలాపురం డిపో నుంచి 4, రాజోలు డిపో నుంచి 4 బస్సులు వెళ్తాయన్నారు. రావులపాలెం డిపో నుంచి 12 బస్సులు 156 ట్రిప్పులు తిరిగేలా కార్యాచరణ రూపొందించామని కుమార్ చెప్పారు.



రాజమహేంద్రవరంలోని పుష్కర ఘాట్ వద్ద అట్లతద్ది నోము తీర్చుకుంటున్న మహిళలు

అట్ల తద్దోయ్ ఆర ట్లోయ్

గౌరీదేవికి భక్తి శ్రద్ధలతో మహిళల పూజలు



అంబాజీపేటలో ఉయ్యాల ఊగుతున్న మహిళ

అట్లతద్ది పండుగను మహిళలు గురువారం వైభవంగా జరుపుకున్నారు. వేకువజామునే లేచి స్నానాలు చేసి అట్లతద్దోయ్... ఆరట్లోయ్ అంటూ సందడి చేశారు. వయో బేధం లేకుండా అందరూ గౌరీదేవిని పూజించారు. అమ్మాయిలు తమకు మంచి భర్త దొరకాలని, అమ్మలు తమ కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని.. అమ్మమ్మలు తమ జీవితం సాఫీగా సాగాలంటూ గౌరీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి ఉపవాసం ఉండి పూజలు జరిపి ఊయాల లూగారు.



రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ వద్ద బొట్టు పెట్టి తాంబూలం, వాయినం ఇస్తున్న మహిళ

సాయంత్రం మరలా గౌరీదేవికి పూజలు చేసి గోదావరి, నదీపాయల్లో దీపాలు, అర్ఘ్యాలు వదిలారు. అనంతరం ముత్తయిదువులు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు.



ముమ్మిడివరంలో గౌరీదేవికి పూజలు చేస్తున్న మహిళలు



కాకినాడ జిల్లా సామర్లకోట మండలం హుస్సేన్‌పురంలో...

సత్యదేవుని సన్నిధిలో హరేకృష్ణ గ్లోబల్ టెంపుల్ ప్రతినిధులు



సత్యదేవుని దర్శనానంతరం సత్యగౌర చంద్ర దాస, హరేకృష్ణ గ్లోబల్ టెంపుల్ ప్రతినిధులు

అన్నవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధికి గురువారం హరేకృష్ణ గ్లోబల్ టెంపుల్ ప్రతినిధులు, అక్షయపాత్ర ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రాంతీయ అధ్యక్షుడు సత్యగౌర చంద్ర దాస విచ్చేశారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. ఈవో వీర్ల సుబ్బారావును మర్యాదపూర్వకంగా కలవగా ఆయన అక్షయపాత్ర నిర్వహణ తీరు తెన్నులను అడిగి తెలుసుకున్నారు.

మత్స్యకార సమస్యలు పరిష్కరిస్తాం

● మూడునెలల్లో అన్నీ సమసిపోతాయ్

● ఉప్పాడ మత్స్యకారులతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ 'మాటామంతీ'



సమావేశంలో మాట్లాడుతున్న పవన్

కాకినాడ/ కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉప్పాడ పరిసర ప్రాంత మత్స్యకారుల సమస్యలపై మూడునెలల్లో సమగ్ర పరిష్కారం చూపుతామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. కలెక్టరేట్ వివేకానంద సమావేశహాలులో గురువారం ఆయన మత్స్యకారులతో మాటా-మంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మత్స్యకార గ్రామాల పెద్దలు, యువత, మహిళలు, స్వచ్ఛంద సంస్థలతో ముఖాముఖిగా వారి సమస్యలను తెలుసుకున్నారు.

● పరిశ్రమల వ్యర్థాలతో సముద్ర జలాలు కలుషితం

ఉప్పాడ, కోనపాపపేట, అమీనాబాద్, మూలపేట తదితర మత్స్యకార గ్రామాల ప్రతినిధులు కె.రాంబాబు, కె.వెంకటరమణ, సీహెచ్ దావీదు, కొల్లి రాంబాబు, ప్రసాద్, సూరాడరాజు, ముమ్మిడి జాన్సన్, కొండా వెంకటరమణ, బడే విజయకుమార్, పైడిపల్లి రాజు, మత్స్యకార యువకులు మోసా దేవళ్ల, వంకా ఎఫేజు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సతీష్, మత్స్యకార మహిళ ఉమ్మిడి అమరేశ్వరి పరిశ్రమల వ్యర్థాలు, ప్రకృతి వైపరీత్యాలవల్ల మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పవన్‌కు వివరించారు. పరిశ్రమల వ్యర్థాలతో సముద్రజలాలు కాలుష్యమయ్యాయని, దీంతో ఉపాధికి నష్టం వాటిల్లుతోందని మత్స్యకారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మత్స్య సంపద నాశనం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై డిప్యూటీ సీఎం స్పందిస్తూ.. చాలా ఏళ్లుగా ఉన్న ఈ సమస్యను ఇవాళే ఎందుకు తెరమీదకు తెచ్చారని, అంత రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. గత ప్రభుత్వాలు తమను పట్టించుకోలేదని, తమ నియోజకవర్గ ఎమ్మెల్యే అయిన మీ దృష్టికి తీసుకువెళ్తే సమస్య పరిష్కారమవుతుందనే ఉద్దేశంతో సముద్రజలాల కలుషిత విషయమై ఆందోళన చేపట్టాల్సి వచ్చిందని చెప్పారు. సమస్యల పట్ల ఆవేదనతో తొందరపాటుగా ఆందోళనకు దిగినందుకు చింతిస్తున్నామని, ఉపముఖ్యమంత్రి పెద్ద మనసుతో తమ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు.

● పొల్యూషన్ ఆడిట్ చేపట్టండి..

ఉప్పాడ ప్రాంత మత్స్యకారులు తెలిపిన పారిశ్రామిక కాలుష్యంపై పొల్యూషన్ ఆడిట్ చేపట్టాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను డిప్యూటీ సీఎం పవన్ ఆదేశించారు. వారంరోజుల్లోగా నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. వందరోజుల్లోగా ఈ సమస్యకు పరిష్కారం చూపుతామని మత్స్యకార ప్రతినిధులకు ఆయన హామీ ఇచ్చారు. పరిశ్రమలు, మత్స్యశాఖ, పీసీబీ, పరిశ్రమల ప్రతినిధులు, మత్స్యకారులు, ఎన్‌జీఓలు, స్టేక్‌హోల్డర్స్ అందరినీ భాగస్వాములను చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వెల్లడించారు. కాలుష్యస్థాయిపై ప్రాథమిక నివేదిక అందజేయాలని రాష్ట్ర పీసీబీ మెంబర్ సెక్రటరీని కోరారు. నిర్మాణంలో ఉన్న హార్బర్ డిజైన్ లోపాలపై ఐఐటీ చెన్నై నిపుణుల కమిటీ నివేదిక ప్రకారం మత్స్యకార బోట్లకు ముప్పు లేకుండా డిజైన్ కరెక్షన్ చేయిస్తానన్నారు. రాష్ట్ర, దేశ అభివృద్ధికి పరిశ్రమలు కూడా అవసరమని, ప్రజల జీవనోపాధికి విఘాతం, లోటు లేకుండా సమతుల్యం పాటించాలన్నారు. ఉప్పాడ బోట్ల ల్యాండింగ్ అంశంలో అంతర్వేది, మచిలీపట్నం ప్రాంత మత్స్యకారులు, ప్రతినిధులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. ఓఎన్జీసీ తరహాలో పరిహారం అందించే అంశం పరిశ్రమలు, మత్స్య, కాలుష్య నియంత్రణ తదితర శాఖలతో ముడిపడిన మల్టీ డిపార్ట్‌మెంటల్ అంశమని ఆయాశాఖలను సమన్వయపరిచి నిర్ణయించాల్సి ఉందన్నారు.

● ఉప్పాడ తీర రక్షణకు ఢిల్లీ వెళతా..

అలల కోత నుంచి ఉప్పాడ తీర ప్రాంత రక్షణకు అవసరమైన రూ.320 కోట్ల నిధులు కేంద్ర హోంశాఖ నుంచి విడుదలయ్యేలా తానే స్వయంగా ఢిల్లీ వెళ్లి హోంమంత్రి అమిత్‌షాను కలుస్తానన్నారు. వచ్చే రెండు, మూడు ఏళ్లల్లో ఈ పనులు పూర్తి చేసేలా కృషి చేస్తానని తెలిపారు.

● పరిహారం చెక్కుల పంపిణీ

సముద్రవేటలో ప్రమాదవశాత్తూ మరణించిన 18 మంది మత్స్యకార కుటుంబాలకు గ్రూపు యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కింద తొలివిడతగా ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.90లక్షల ఎక్స్‌గ్రేషియా మొత్తాల చెక్కులను ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పంపిణీ చేశారు.



కార్యక్రమంలో పాల్గొన్న మత్స్యకార ప్రతినిధులు

17న కేశనపల్లిలో పవన్ కల్యాణ్ పర్యటన

రాజోలు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మలికిపురం మండలం శంకరగుప్తం డ్రైన్ ముంపు వల్ల జరిగిన నష్టాన్ని పరిశీలించడానికి ఈనెల 17 వ తేదీన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కేశనపల్లి రానున్నారని రాజోలు ఎమ్మెల్యే దేవా వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా రాజోలులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరోజు రైతులు, బాధితులతో మాట్లాడతారని పేర్కొన్నారు. అలాగే పొదలాడ పంచాయతీ కార్యాలయంలో కూటమి నాయకులు, అధికారులతో పవన్ పర్యటనపై చర్చించారు. పొదలాడలో జాతీయ రహదారి 216 పక్కన ఉన్న పొదలాడ సెంటర్ నుంచి గ్రామపంచాయితీ కార్యాలయం వరకు ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ. 50 లక్షలతో కిలోమీటరు నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును పవన్ ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం పల్లెపండుగ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. చాగంటి స్వామి, సర్పంచ్ కడలి సత్యనారాయణ, దిరిశాల బాలాజీ, పినిశెట్టి బుజ్జి, ఎంపీటీసీ శిరిగినీడి వెంకటేశ్వరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరు మహిళా దొంగల అరెస్ట్

చోరీ సొత్తు స్వాధీనం

రాజమహేంద్రవరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): టూటౌన్ పోలీసులు ఇద్దరు మహిళా దొంగలను అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సీఐ శివ గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 6న దేవరపల్లి మండలం యర్నగూడేనికి చెందిన జాగాని నాగమాధవి తన భర్త, పిల్లలతో కలిసి రాజమండ్రి రావడానికి ఆటో ఎక్కారు. కాపవరం సమీపంలో ఇద్దరు మహిళలు అదే ఆటో ఎక్కి, ప్రయాణంలో సీటు జాగా సరిపోవడం లేదంటూ మాధవి దృష్టి మరల్చారు. ఆ ఇద్దరు మహిళలు కోటిపల్లి బస్టాండ్ వద్ద ఆటో దిగిపోయారు. రైల్వే స్టేషన్ సమీపంలో మాధవి తన హ్యాండ్ బ్యాగ్ చూసుకోగా జిప్ ఓపెన్ చేసి ఉంది. బ్యాగులో ఉంచిన బంగారు ఆభరణాల ప్లాస్టిక్ బాక్స్ కనిపించలేదు.దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో గోకవరం డ్రైవర్స్ కాలనీకి చెందిన ఆవుల భూలక్ష్మి, నాగెల్లి దుర్గను నిందితులుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నామని సీఐ చెప్పారు. వాళ్ల వద్ద నుంచి 70గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని సీఐ పేర్కొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని ఎలక్ట్రీషియన్ మృతి

పిఠాపురం రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం పి.తిమ్మాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎలక్ట్రీషియన్ మృతిచెందాడు. ఏలేశ్వరం మండలం యర్రవరం గ్రామానికి చెందిన కాదులూరి పవన్‌తేజ(27) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం యర్రవరం నుంచి కాకినాడకు మోటార్‌సైకిల్‌పై బయలుదేరాడు. పి.తిమ్మాపురం గ్రామం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ప్రమాదంలో పవన్‌తేజ ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. పిఠాపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ట్రాక్టర్ ఢీకొని మృతిచెందిన పవన్ తేజ

పిఠాపురంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



పిఠాపురం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలో గుర్తు తెలియని వ్యక్తి (45)గురువారం సాయంత్రం మృతి చెందాడు. కాలనీ పరిసర ప్రాంతాల్లో చెత్తకాగితాలు ఏరుకుంటూ జీవనం సాగించే వ్యక్తికి అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చాయి. పాత ఎక్సైజు స్టేషన్ వద్ద కుప్పకూలిపోయాడు. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని అతడిని పరీక్షించి చనిపోయినట్టు గుర్తించారు. పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలియరాలేదని తెలిపారు.

'రాయవరం' బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

● రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో మృతదేహాలు పరిశీలించిన మంత్రి సుభాష్

● పేలుడు ఘటనలో ఎనిమిదికి చేరిన మృతుల సంఖ్య

● బాణసంచా తయారీ కేంద్రాల్లో విస్తృత తనిఖీలకు ఆదేశాలు



మృతుల బంధువులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం (ద్రాక్షారామ), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి):అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో బుధవారం జరిగిన బాణసంచా విస్ఫోటనం ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని మంత్రి సుభాష్ హామీ ఇచ్చారు. గురువారం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలోని మృతదేహాలను ఆయన పరిశీలించారు. పేలుడు ఘటనలో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరుకోవడంపై విచారం వ్యక్తం చేశారు. అనంతరం మృతుల కుటుంబీకులతో మాట్లాడి ఓదార్చారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించాలని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. ప్రవీణ్, పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ బాణాసంచా కేంద్రం వద్ద శాంపిల్స్ సేకరించి విజయవాడ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించామన్నారు. తయారీకి సంబంధించి అన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ప్రమాదం జరగడం, యజమానితో సహా ఎనిమిది మంది మృతి చెందడం దురదృష్టకరమన్నారు. ఈయన వెంటపాటు పట్టణ టీడీపీ అధ్యక్షుడు వుండవిల్లి శివ, మున్సిపల్ మాజీ కౌన్సిలరు దంగేటి గౌరీశంకర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● పేలుడుపై దర్యాప్తునకు ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీ

బాణసంచా పేలుడుకు సంబంధించి నిజానిజాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. మునిసిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ నేతృత్వంలో దర్యాప్తు జరగనుంది. ఇందులో కమిటీ సభ్యుడిగా ఐజీ ఆకే రవి కృష్ణను ఉన్నారు. ఈ దుర్ఘటనకు బాధ్యులెవరో తేల్చాలని పేర్కొంది. కమిటీకి సహకరించాలని కోనసీమ కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనాకు ఆదేశాలు అందాయి. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఏడు మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

పేలుడు ఘటనలో అసువులు బాసిన ఏడుగురి మృతదేహాలకు గురువారం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం పూర్తి చేశారు. ఆసుపత్రి పర్యవేక్షకుడు డా.ప్రవీణ్,ఆర్ఎంవో డా. చక్రధర్ పర్యవేక్షణలో ఆసుపత్రి వైద్యులు, మండపేట ఆసుపత్రి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగింది. అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, సీఐ ఎం.వెంకట నారాయణ, మండపేట రూరల్ సీఐ దొరరాజు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

మృత్యువుతో పోరాడి ఓడిన విజయలక్ష్మి



విజయలక్ష్మి (ఫైల్)

జీజీహెచ్ (కాకినాడ)/ రాయవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) కొమరిపాలెం బాణసంచా విస్ఫోటనంలో తీవ్ర గాయాలపాలై కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విజయలక్ష్మి మృత్యువుతో పోరాడి బుధవారం అర్ధరాత్రి తుదిశ్వాస విడిచింది. రాయవరం మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన వాసంశెట్టి విజయలక్ష్మి (45) కు భర్త వెంకట్రావు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఏడాది కాలంగా కొమరిపాలెం శివారు ప్రాంతంలో ఉన్న శ్రీలక్ష్మీగణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్‌లో తన కుమార్తె దుర్గతో పాటు వెళ్లి బాణసంచా కార్మికులుగా పని చేస్తున్నారు.

నమూనాలు సేకరించిన ఫోరెన్సిక్ ల్యాబ్ సిబ్బంది

● సంఘటనా స్థలం నుంచి మందుగుండు సేకరణ

మండపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలంలో బుధవారం బాణసంచా దుకాణంలో జరిగిన పేలుడు సంఘటనపై విజయవాడకు చెందిన ఫోరెన్సిక్ ల్యాబ్‌సభ్యులు, స్థానిక పోలీస్ క్లూస్ టీమ్‌తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని శాంపిల్స్‌ను సేకరించారు. అసలు ప్రమాదం ఎలా జరిగింది, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల జరిగిందా? అనే అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించి పేలిన ప్రదేశం నుంచి కాలిబూడిదైన మందుగుండు సామగ్రిని శాంపిల్స్ నిమిత్తం విజయవాడ ల్యాబ్‌కు తీసుకువెళ్లారు. కాగా, ముడిసరుకుతో తయారు చేసే చిచ్చుబుడ్లు, మతాబులు, టపాసులు, తారాజువ్వలు వంటివి తయారు చేసే సమయంలో మందును దట్టించే సమయంలో పేలుడు సంభవించవచ్చని ఫైర్ నిపుణులు చెబుతున్నారు. మొత్తమ్మీద ఏది ఏమైనప్పటికీ రాయవరంలో జరిగిన విస్ఫోటనం రాష్ట్ర వ్యాప్తంగా తీవ్రంగా కలచివేసింది.

పిడుగుపాటుకు వ్యాపారవేత్త మృతి

● కాకినాడకు చెందిన వాసిగా గుర్తింపు



మృతిచెందిన కొవ్వూరు వెంకట రామకృష్ణా రెడ్డి

చేజర్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎక్కడో కాకినాడలో వ్యాపారవేత్తగా రాణిస్తూ వ్యవసాయం మీద మక్కువతో నెల్లూరు జిల్లా చేజర్ల మండలం చేజర్ల కండ్రిక సమీపంలో పొలం తీసుకుని పనులు చేయిస్తుండగా పిడుగుపాటుకు గురై మృతిచెందిన సంఘటన స్థానికులను కలచివేసింది, పూర్తి వివరాల మేరకు ... కాకినాడలో బిల్డర్ కాంట్రాక్టర్‌గా రాణిస్తున్న కొవ్వూరు వెంకట రామకృష్ణారెడ్డి (60) వ్యవసాయం చేయాలన్న ఉద్దేశంతో చేజర్ల సమీపంలో కొంతకాలం క్రితం పొలాన్ని తీసుకున్నాడు. రెండునెలల నుంచి అక్కడే ఉంటూ పొలంలో రోడ్లు, తదితర పనులు చేయిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం కూలీల చేత పనులు చేయిస్తుండగా ఒక్కసారిగా మారిన వాతావరణంతో పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా, మృతుడు వెంకటరామ కృష్ణారెడ్డి చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో మమేకమై అందరితో కలిసిపోయేవాడని, ఇంతలోనే ఇటువంటి సంఘటన జరగడం దురదృష్టకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు నెల్లూరుకు బయలుదేరినట్లు తెలిసింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వెంకటరామ కృష్ణారెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బాణసంచా పేలిన ఘటనలో..

● చికిత్స పొందుతూ పురోహితుడు మృతి

పి.గన్నవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అమ్మవారి ఊరేగింపులో ప్రమాదవశాత్తు బాణసంచా (జువ్వలు) పేలి గాయాలపాలైన ఇద్దరు పురోహితుల్లో ఒకరు చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పి.గన్నవరం మండలం మానేపల్లిలో ఈనెల 4వ తేదీ రాత్రి జరిగిన అమ్మవారి ఊరేగింపుల్లో సేవలో ఉన్న పురోహితులు వెలవలపల్లి విజయ ప్రసాద్ (55), పెద్దింటి రామరత్నగోపాల్ (35)కు ప్రమాదవశాత్తు బాణసంచా (జువ్వలు) పేలడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఇద్దరు పురోహితుల్ని అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. వారిలో విజయప్రసాద్ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం 4.30 సమయంలో మృతిచెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బీ.శివకృష్ణ తెలిపారు.

అనుమతుల్లేని మందుగుండు సామగ్రి సీజ్



కడియపులంకలో పోలీసులు పట్టుకున్న మందుగుండు సామగ్రి

కడియపులంకలో రూ.2,51,600 విలువైన క్రాకర్స్ స్వాధీనం

కడియం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): అనుమతులు, లైసెన్సులు లేకుండా ఫైర్ క్రాకర్స్ స్టాక్ పాయింట్లను పోలీసులు గుర్తించారు. సీఐ ఎ.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఎటు వంటి అనుమతులు లేకుండా కడియపులంకలో బలభద్రుని నాగవీరసూర్యప్రకాష్ ఇంటిలో రూ.1,25,000 విలువైన క్రాకర్స్, గ్రంధి శ్రీరామచంద్రమూర్తికి చెందిన షాపులో రూ.21, 600 విలువైన క్రాకర్స్, గెల్లి వెంకటేశ్వరరావు ఇంటిలో రూ.1,05,000 విలువైన క్రాకర్స్ స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్టు తెలిపారు. వీరిపై విడివిడిగా మూడు కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ ధనలక్ష్మి, స్పెషల్ బ్రాంచి హెడ్ కానిస్టేబుల్ జనార్ధనరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అనుమతులు లేకుండా క్రాకర్స్ ఉంచరాదని, అలా ఉంచితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, గుర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గంధకం, పటాస్ నిల్వలు సీజ్

కొత్తపేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బాణసంచా తయారీకి ఉపయోగించే అక్రమంగా నిల్వ ఉంచిన గంధకం, పటాస్, క్లోరైడ్‌లను కొత్తపేట పోలీసులు సీజ్ చేసి ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ జి.సురేంద్ర తెలిపారు. కొత్తపేట ఆర్ఎస్ నగర్‌లో యర్రంశెట్టి మురళీకృష్ణకు చెందిన ఇంట్లో ఎక్స్‌ప్లోజివ్స్ నిల్వ చేసినట్టు వచ్చిన సమాచారం మేరకు రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ జి.సురేంద్ర దాడి చేశారు. ఈ మేరకు 200 కిలోల ఎక్స్‌ప్లోజివ్‌ను సీజ్ చేశామని, వాటి విలువ సుమారుగా రూ.1,04,730 ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు.

జొన్నాడలో అనధికార స్టోన్ క్రషర్ సీజ్



అనధికారికంగా ఉన్న క్రషరును సీజ్ చేస్తున్న అధికారులు

ఆలమూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం జొన్నాడ వద్ద గోదావరి ఒడ్డున అనధికారికంగా ఏర్పాటు చేసిన స్టోన్ క్రషర్‌ను గురువారం అధికారులు సీజ్ చేశారు. ఇక్కడ కొంతకాలంగా జరుగుతున్న స్టోన్ క్రషింగ్ రైతులకు ఇబ్బందికరంగా మారడంతో పలువురు రైతులు స్థానిక అధికారులతోపాటు కలెక్టర్, ఆర్డీవోలకు ఫిర్యాదు చేశారు.ఈ నేపథ్యంలో క్రషర్‌ను సీజ్ చేయాలని గత నెల 29న నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ క్రషర్‌ను నిర్వహిస్తుండడంతో రైతులు చేసిన ఫిర్యాదుతో ఎంపీడీవో ఎ.రాజు ఆదేశాల మేరకు మండల పరిషత్ ఏవో ఎం.మోహర్‌ప్రకాష్, జొన్నాడ కార్యదర్శి సీహెచ్.వీరమాత, పోలీసులు, సిబ్బందితో వెళ్లి నోటీసులు అంటించి సీజ్ చేశారు. అనుమతులు లేనిదే ఎటువంటి క్రషింగ్ చేయడానికి వీలు లేదని వారు హెచ్చరించారు.

జాతీయ షూటింగ్‌బాల్ పోటీలకు మేఘన ఎంపిక



మేఘనను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ముమ్మిడివరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కర్నూలులో ఇటీవల జరిగిన అంతర్ జిల్లాల బాలుర, బాలికల షూటింగ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ముమ్మిడివరం మండలం కొత్తలంక జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న గెద్దాడ మేఘన ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికైంది. నవంబరు 7 నుంచి 9వరకు ఉత్తరప్రదేశ్ హెచ్‌ఆర్‌ఐటీ యూనివర్శిటీలో జరిగే జూనియర్ నేషనల్ షూటింగ్‌బాల్ పోటీల్లో పాల్గొంటుందని పీడీ కొప్పిశెట్టి సుజాత తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన మేఘనను విద్యాకమిటీ చైర్మన్ జైన్ బాబ్జి, హెచ్ఎం గోవర్ధనగిరిరావు, ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న 14 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు.

నలుగురు ఉద్యోగుల సస్పెన్షన్

» కోరంగి చేయూత మార్ట్‌లో రూ.15.80 లక్షల దుర్వినియోగం

» ఇద్దరు ఏపీఎంలు, మరో ఇద్దరు కమ్యూనిటీ కోఆర్డినేటర్లపై వేటు

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇందులో గొల్లప్రోలు ఏపీఎం సన్యాసిరావు, తాళ్లరేవు ఇన్‌చార్జి ఏపీఎంగా పనిచేసిన విష్ణు, మరో ఇద్దరు కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు (సీసీలు) ఉన్నారు. మండలంలోని కోరంగిలో ఉన్న చేయూత మార్ట్‌లో రూ.15.80 లక్షలు నిధులు దుర్వినియోగం అవ్వడంతో వీరిపై వేటు వేశారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో చేయూత మార్ట్‌ను డ్వాక్రా సభ్యుల ఆర్థిక ఉన్నతి కోసం స్థాపించారు. దీని స్థాపన కోసం మండలంలో ఉన్న ఒక్కొక్క డ్వాక్రా గ్రూపు నుంచి వేలాది రూపాయలు పెట్టుబడి కింద సేకరించారు. మార్ట్‌లో నిత్యావసర వస్తువులను విక్రయించేవారు.వాటి ద్వారా వచ్చిన ఆదాయంలో లాభాలను డ్వాక్రా సంఘాలకు పంపిణీ చేస్తామని నమ్మబలికారు. తీరా వస్తువులు విక్రయించగా వచ్చిన సొమ్ములను సంబంధిత బ్యాంకు ఖాతాకు జమ చేయకుండా దుర్వినియోగం చేసినట్టు విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో ఇద్దరు ఏపీఎంలు, మరో ఇద్దరు సీసీలను సస్పెండ్ చేశారు. అయితే గతంలో తాళ్లరేవులో పనిచేసిన ఏపీఎం విష్ణు ఇప్పుడు కోనసీమ జిల్లా మండపేటలో విధుల్లో ఉన్నారు. ఈ క్రమంలో విష్ణును సస్పెండ్ చేయాలని ఆ జిల్లా డీఆర్‌డీఏ పీడీకి కాకినాడ జిల్లా డీఆర్‌డీఏ పీడీ ఒక ఉత్తర్వును పంపించారు. కాగా కాకినాడ డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు గురువారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ సొమ్ములు దుర్వినియోగం చేసిన నలుగురిని సస్పెండ్ చేశామన్నారు. ఏపీఎం విష్ణు మండపేటలో విధుల్లో ఉండటం వల్ల ఆయన్ని సస్పెండ్ చేయాలని కోనసీమ డీఆర్‌డీఏ పీడీని కోరామన్నారు.

జీజీహెచ్‌లో ముగ్గురిపై వేటు

జీజీహెచ్(కాకినాడ), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో రోగుల నుంచి లంచం తీసుకుంటున్నారనే అవినీతి ఆరోపణల ఎదుర్కొంటున్న ఇద్దరు ఎఫ్‌ఎన్‌వోలు, ఒక ఎంఎన్‌వోను సస్పెండ్ చేస్తూ వైద్యాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వారిలో రెగ్యులర్ ఎఫ్‌ఎన్‌వో జె.వరలక్ష్మి, అవుట్ సోర్సింగ్ ఎఫ్‌ఎన్‌వో, ఎంఎన్‌వోలు సువర్ణశ్రీ, అచ్యుత్‌కుమార్ ఉన్నారు. అలాగే ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో ఉద్యోగి డి.అన్నపూర్ణను తొలగించాలని కాంట్రాక్ట్ సంస్థకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ నలుగురు గైనిక్ ఆపరేషన్ థియేటర్(జీవోటీ)లో పని చేస్తున్నారు.

నేడు, రేపు డిస్ట్రిక్ట్ ఎలక్ట్రానిక్ ఎగ్జిబిషన్ సేల్ అండ్ ఎక్స్‌పో

రాజమహేంద్రవరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల అమలులోకి వచ్చిన జీఎస్టీ 2.0 విధానం వల్ల వివిధ వస్తువులపై తగ్గిన పన్ను రేట్లపై వ్యాపారులకు, ప్రజలకు అవగాహన కల్పించడానికి శుక్ర, శనివారాల్లో డిస్ట్రిక్ట్ ఎలక్ట్రానిక్ ఎగ్జిబిషన్ సేల్ అండ్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్టు రాజమహేంద్రవరం (తూర్పు, కోనసీమ జిల్లాల) జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఎం.సుధాకర్ తెలిపారు. రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్‌లోని ధర్మంచర కమ్యూనిటీహాల్‌లో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ నినాదంతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, గృహోపకరణాలు, ఇతర ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాల స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు.నగరంలోని సాధారణ ప్రజానీకం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, తగ్గిన ధరలను తెలుసుకోవాలని ఆయన కోరారు.

షూటింగ్‌బాల్ పోటీల్లో సాహితికి కాంస్యం

జేఎన్టీయూకే, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకేలోని యూసీఈకే ఏఐఎంఎల్ విద్యార్థిని కె.సింధూర సాహితి 8వ అంతర జిల్లాల షూటింగ్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. ఈ పోటీలు సెప్టెంబరు 25, 26 తేదీల్లో కర్నూల్‌లో జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థిని వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్, డైరెక్టర్ కృష్ణమోహన్ అభినందించారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదల ప్రాణాలకు రక్షణ

ఎమ్మెల్యే గోరంట్ల
దుళ్లలో చెక్కుల పంపిణీ


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సీఎం సహాయనిధి ద్వారా కోట్లాది రూపాయలు అందజేసి పేదల ప్రాణాలు కాపాడుతోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. మండలంలో వివిధ గ్రామాలకు చెందిన 18 మంది లబ్ధిదారులకు రూ.12,51,357 చెక్కులను గురువారం దుళ్లలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవలో రాష్ట్ర వ్యాప్తంగా వైద్యసేవలు అందిస్తున్నామని, ఆరోగ్యశ్రీలో వర్తించని వైద్యసేవలకు పేదలపై వైద్యఖర్చుల భారం తగ్గేలా సీఎం చంద్రబాబు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకుంటున్నారన్నారు.ప్రకృతి సాగు ద్వారా నాణ్యమైన పంటలు పండించవచ్చని, రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు.అలాగే స్థానిక ఉన్నత పాఠశాలలో వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడా మైదానం అభివృద్ధికి ఎమ్మెల్యే గోరంట్ల స్వీయనిధులు రూ.లక్ష కేటాయించారు. గురువారం వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, వెలుగుబంటి నాని, అన్నందేవుల చంటి, గుర్రపు సత్యనారాయణ, ప్రత్తిపాటి రామారావుచౌదరి, చెల్లుబోయిన శ్రీను, ముద్రగడ జమీ, ఆదిమూలం సాయిబాబా, నూరపురెడ్డి భరత్ పాల్గొన్నారు.

డీకాస్టింగ్ ఇసుక రీచ్‌పై అభిప్రాయ సేకరణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణనాయక్

సీతానగరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సీతానగరంలోని అఖండ గోదావరి ఎడమ ఒడ్డు పరిధిలోని డి5 బ్లాక్ ఇసుక రీచ్‌పై అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు.రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు పీసీబీ, రెవెన్యూ, మైన్స్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సభలో ప్రాజెక్టు వివరాలను వివరిస్తూ పర్యావరణ పరిరక్షణ చర్యలు, నీటి వినియోగం, పరిమితులు, స్థానిక ఉపాధి అవకాశాలు, ఇసుక తవ్వకాల సాంకేతిక అంశాలపై ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా అనుమతులకు ప్రతిపాదన పంపుతామన్నారు. కార్యక్రమంలో పీసీబీ ఈఈ శ్రీనివాసరావు, ఏడీ మైన్స్ డి.ఫణిభూషణ్‌రెడ్డి తహశీల్దార్ ఎ.శ్రీనివాస్, గ్రామస్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని దహనం చేసిన వారిని శిక్షించాలి

రాజమహేంద్రవరంలో జిల్లా కోర్టు వద్ద అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధుల నిరసన


నిరసన తెలుపుతున్న అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా దేవళంపేటలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని దహనం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రతినిధులు, సీనియర్ న్యాయవాదులు, రాజమహేంద్రవరంలోని జిల్లా కోర్టు వద్ద గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్నాల కోట వెంకటేశ్వరరావు, న్యాయవాది చింతపర్తి రాంబాబు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాన్ని దహనం చేయడం హేయమన్నారు. హోం మంత్రి ఆ గ్రామాన్ని సందర్శించి, శాంతిభద్రతలను పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు యార్లగడ్డ అశోక్‌కుమార్, బట్టు సునీల్‌కుమార్, గేదెల మోహనవంశీ, సొసైటీ రాష్ట్ర ప్రతినిధులు వాకా రామ్మోహన్, సిరిపురం గిరీష్‌కుమార్, వినుకొండ లక్ష్మీనారాయణ, ఏలూరు విజయ్ ప్రతాప్‌కుమార్, ముప్పిడి సుధీర్‌కుమార్ సిన్హా, వి.మోహన్‌కుమార్, పూడా నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం



కోరుకొండ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా గురువారం ఉదయం మండలంలోని మధురపూడి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లా కలెక్టర్ చేకూరి కీర్తి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిసి ఘన స్వాగతం పలికారు.

◄◄ డిప్యూటీ సీఎంకు మొక్క అందిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

అభివృద్ధి పనులపై మిన్నకుంటే కుదరదు

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు మిన్నకుంటే గోదావరి పుష్కరాలు-2027 అభివృద్ధి పనులు జరగవని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. గురువారం రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2027 జూన్‌లో పుష్కరాలు జరుగుతాయని, రూ.1500 కోట్లు నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తామని పురపాలక శాఖ మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు చెప్పారని.. అటుపై కనీసం పట్టించుకోకుండా ఉన్నారన్నారు. రివర్ ఫ్రంట్ వ్యూ నిర్మిస్తున్నామని ఉత్సాహం చూపిన ఆదిరెడ్డి వాసు మిన్నకున్నారన్నారు. తెలుగు యూనివర్సిటీకి కనీసం వీసీని నియమించలేదన్నారు. కార్పొరేషన్‌కు కౌన్సిల్ లేదని, విమర్శించారు. సమావేశంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్‌కు కార్మికులంటే చులకన

ఏపీ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం, కార్మిక శాఖ మంత్రి.. కార్మికులను చులకనగా చూస్తున్నారని ఏపీ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బొజ్జ రామకృష్ణ ఒక ప్రకటనలో విమర్శించారు. భవన నిర్మాణ కార్మికుల కష్టాలు, కన్నీళ్లు సీఎంకు కనిపించడం లేదన్నారు. సంక్షేమ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికులు బిల్డింగులు కడితేనే ప్రభుత్వానికి సెస్ ద్వారా వందలాది కోట్లు వస్తున్నాయన్నారు. రూ.110 చలానా, రూ.60 రెన్యువల్ కట్టించుకుంటున్నారని ఈ సొమ్ము ఎక్కడికి వెళుతుందని ప్రశ్నించారు. సంక్షేమ బోర్డులో నిలిచిపోయిన 46,000 క్లెయిమ్‌లను విడుదల చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని అన్నారు.

రోటరీ క్లబ్ యువ సేవా కార్యక్రమాలు ఆరంభం

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు కొనసాగనున్న యువ సేవా కార్యక్రమాల ప్రారంభోత్సవం గురువారం స్థానిక వై-జంక్షన్ వద్ద ఉన్న రోటరీ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి క్లబ్ అధ్యక్షుడు చిట్టూరి సూర్యనారాయణ మూర్తి, ఇల్ల సాయినాథ్, పట్టపగలు వెంకటరావు, కేకే సంజీవరావు, సుంకర రవికుమార్ హాజరయ్యారు. తదనంతరనం నిర్వహించిన నృత్య పోటీలకు, ప్రసిద్ధ నృత్య గురువులు గాయత్రి పట్నాయక్, రాజరాజేశ్వరి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల ప్రతిభను పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, రోటరీ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

‘నేటి నుంచి బోధనేతర పనుల బహిష్కరణ’



కడియం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఈ నెల 10 నుంచి బోధనేతర పనులు, విద్యాశక్తి కార్యక్రమం బహిష్కరిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) సంఘ నాయకులు తెలిపారు. గురువారం ఎంఈవో మణికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మితిమీరిన బోధనేతర కార్యక్రమాల వల్ల బోధన సమయం హరించుకుపోతోందని, ఉపాధ్యాయులకు బోధనపై ఆసక్తి తగ్గిపోతోందన్నారు. పలు మార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోనందున ఈ నెల 7న విజయవాడలో జరిగిన పోరుబాట కార్యక్రమంలో బోధనేతర పనులు ఈనెల 10న బహిష్కరించాలని,మరింత నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాలని ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ చేసిన నిర్ణయాన్ని గుర్తుచేశారు.ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన పనులు మాత్రమే ఉపాధ్యాయులు చేపడుతారని, పరీక్షల నిర్వహణ తప్ప బోధనేతర పనులు చేపట్టబోమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కె.రమేష్, ఎస్.అనిత, ఎస్.శ్రీనివాస్, బి.అబ్బాయి, ఐపీవీ గోపాలకృష్ణ, కె.శ్రీకాంత్, వి.వరలక్ష్మి, ఎస్.సత్యనారాయణ, రమణమూర్తి, సతీష్ పాల్గొన్నారు.

పన్ను తగ్గింపుతో..
ఆర్థిక ప్రయోజనం


జీఎస్టీ 2.0పై మహిళకు అవగాహన కలిగిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి, ఎమ్మెల్సీ సోము

» ఎమ్మెల్యే నల్లమిల్లి, ఎమ్మెల్సీ సోము
» రాజమహేంద్రవరంలో బీజేపీ నాయకులతో కలిసి పలు షోరూమ్‌ల సందర్శన
» జీఎస్టీ 2.0పై అవగాహన కార్యక్రమాలు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ మండలి పన్ను సంస్కరణలకు శ్రీకారం చుట్టడంతో వస్తు, సరుకులపై పన్నులు తగ్గడం ద్వారా వినియోగదారులకు ఆర్థిక ప్రయోజనం చేకూరనుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. గురువారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని సోనో విజన్, హోండా షోరూం, డీమార్టుల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, బీజేపీ నాయకులు సందర్శించారు. అక్కడి వస్తు, సరుకుల ధరలను పరిశీలించారు. కొనుగోలుదారులతో మాట్లాడారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ జీఎస్టీ 2.0 సంస్కరణలపై రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న విమర్శలు అర్థరహితమని అన్నారు. దేశంలో ఏకీకృత పన్ను విధానం తీసుకురావడానికి గతంలో జీఎస్టీ తీసుకొచ్చామని, దీనివల్ల ఆర్థిక వ్యవస్థ బలోపేతమైందని, ఆ ప్రయోజనాలను ప్రజలకు అందించేందుకు ప్రధాని మోదీ ప్రభుత్వం పన్ను శ్లాబుల్లో సంస్కరణలు తీసుకొచ్చిందని పేర్కొన్నారు. సంస్కరణల నేపథ్యంలో టర్నోవర్ పెరగడం వల్ల వ్యాపారులకు ప్రయోజనంతోపాటు ప్రభుత్వానికి ట్యాక్సు పెరుగుతుందని, ధరలు తగ్గి వినియోగదారునికి మేలు జరుగుతుందన్నారు. నిత్యావసర వస్తువులు, ఫుడ్ ప్రొడక్ట్సు వంటి వాటిపై జీఎస్టీ తగ్గింపు ఇంకా ప్రభావం కనబడలేదని, 15, 20 రోజుల్లో జీఎస్టీ పూర్తిస్థాయిలో తగ్గింపు అందుబాటులోకి వస్తుందని నల్లమిల్లి, సోము చెప్పా రు. డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో బాణసంచా పేలుడు ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిన తర్వాత వాస్తవాలు బయటకు వస్తాయని, ఇప్పటికే బాధితులను ఆదుకోవడానికి సీఎం చంద్రబాబు అన్ని చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, ఇతర నాయకులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: మండలంలోని ధవళేశ్వరంలో ఎంపీడీవో సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, తహశీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్య క్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీలో రోగులను కలిసి ఏఏ విభాగాల్లో, ఏఏ మందుల ధరలు తగ్గాయో వివరించారు. అలాగే వివిధ రోగాలకు వాడే మందుల ధరలు తగ్గాయని వి వరించారు. ఈ సందర్భంగా సీఈఎం మెడికల్ హాస్పిటల్, పీహెచ్‌సీలు, మెడికల్ షాపుల వద్దకు వెళ్లి ప్రజలకు జీఎస్టీ ప్రయోజనాలను తెలియజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జ్యోతి, జీఎస్టీ అధికారి నీరజ, పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

రంగంపేట: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఆర్థికంగా ఎంతో మేలు కలుగుతుందని రంగంపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి అన్నారు.

రంగంపేట పీహెచ్‌సీ వద్ద జరిగిన అవగాహన సదస్సులో డాక్టర్ బి.వేణుశ్రీలక్ష్మి మాట్లాడుతూ మెడిసిన్, హెల్త్ ఇన్సూరెన్స్, వెల్‌నెస్ సేవలపై జీఎస్టీ తగ్గింపు ప్రజలకు ఖర్చులు తగ్గుతాయని, ఈ విషయాలను ప్రజలకు చేరువ చేసేందుకు గ్రామాల్లోని ఆరోగ్య కేంద్రాల వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో తులసిదాస్, పీహెచ్‌ఎన్ కె.మేరీఫైనా, సిబ్బంది, మహిళా సంఘాలు, ప్రజలు పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక పీహెచ్‌సీ వద్ద వైద్యురాలు శైలజారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎంపీపీ జోత్స్న జీఎస్టీ తగ్గింపుతో వస్తుసేవల ధరలు తగ్గి తద్వారా కలిగే లాభాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో వై.సుబ్బారాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


ధవళేశ్వరంలో సీఈఎం ఆసుపత్రి వద్ద జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు


సీతానగరం పీహెచ్‌సీ వద్ద అవగాహన కార్యక్రమం

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం


చిట్టూరి శ్యామల కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

» ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
» వి.సావరం ఘటనలో బాధిత కుటుంబాలకు పరామర్శ

అనపర్తి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రాయవరం మండలం వి.సావరంలో జరిగిన అగ్నిప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను, గాయపడి చికిత్స పొందుతున్న వారిని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన అనపర్తి సావరానికి చెందిన కురుపూడి జ్యోతి, పెంకే శేషారత్నం, అనపర్తికి చెందిన చిట్టూరి శ్యామల బంధువులను గురువారం ఆయన పరామర్శించారు.కుటుంబానికి చేదోడుగా ఉండేందుకు పనులకు వెళ్లిన వీరంతా ఇలా మరణించారని బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అగ్ని ప్రమాదం జరగడం బాధాకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తుందన్నారు. మృతులు, క్షతగాత్రుల్లో ఎంత మందికి బీమా ఉందో విచారించి వారికి బీమా సొమ్ము అందే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. చికిత్స పొందుతున్న మహిళకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ముగిసిన అంత్యక్రియలు

అగ్ని ప్రమాదంలో సజీవ దహనమైన అనపర్తికి చెందిన ముగ్గురు మహిళలకు గురువారం అంత్యక్రియలు పూర్తి చేశారు. మృతదేహాలకు రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం పూర్తి చేసి బంధువులకు అప్పగించగా మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు.

సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు


గణేష్‌చౌక్‌లోని బీసీ బాలికల హాస్టల్‌లో డ్రైనేజీ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాసు

ఆకస్మిక తనిఖీలో ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించకుండా గాలికి వదిలేశారని, కూటమి అధికారంలోకి వచ్చిన కొద్దినెలల్లోనే హాస్టళ్లలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. గురువారం రాజమహేంద్రవరం గణేష్‌చౌక్‌లోని బీసీ బాలికల వసతిగృహాన్ని స్థానిక నాయకులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టళ్లలో బాలికలకు అందుతున్న సౌకర్యాలు, రక్షణ చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ హయాంలో హాస్టల్‌లోని 20 మరుగుదొడ్లు అధ్వానంగా ఉండేవని, వందమంది బాలికలకు రెండు మాత్రమే పనిచేసేవని అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక సీఎస్‌ఆర్ నిధులతో వసతిగృహంలో మరుగుదొడ్లు బాగు చేయించి అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. అలాగే వై.జంక్షన్‌లోని బాలుర వసతిగృహంలోనూ, ఆర్ట్స్ కళాశాల ఆవరణలోని ఎస్టీ వసతిగృహంలోనూ సీఎస్‌ఆర్ నిధులతో సదుపాయాలు, మరుగుదొడ్లు మరమ్మతులు చేయించామని ఎమ్మెల్యే వాసు పేర్కొన్నారు. గణేష్‌చౌక్ రైతు బజార్ వెనుక కొందరు ఆకతాయిలు మద్యం, మాదకద్రవ్యాలు తాగడం తమ దృష్టికి వచ్చిందని, వాటిని అరికట్టడానికి చర్యలు తీసుకుంటామని, స్థానిక వ్యాపారులు ఈ బాధ్యత తీసుకోవాలని సూచించామన్నారు. కార్యక్రమంలో సహాయ బీసీ వెల్ఫేర్ అధికారి సుబ్బారావు, వార్డెన్ సత్యవాణి, టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

జడ్జిల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలి

బద్దే జార్జిఆంటోని

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): న్యాయమూర్తుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలని బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ గౌరవాధ్యక్షుడు బద్దే జార్జి ఆంటోని డిమాండ్ చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆంటోని మాట్లాడారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడి జరగడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇటువంటి చర్యలు మరల పునరావృతం కాకుండా చట్టప్రకారం గట్టి చర్యలు చేపట్టాలన్నారు. న్యాయవాదికి సీజే సలహా ఇచ్చారని, దానిని సానుకూల దృక్పథంతో స్వీకరించకుండా ఆ న్యాయవాది కోర్టులోనే ఏకంగా సీజేపై దాడి చేశాడని ఇది సరైన విధానం కాదన్నారు. అలాగే చిత్తూరు జిల్లాలో అంబేడ్కర్ విగ్రహాన్ని తగులబెట్టడాన్ని ఆంటోని ఖండించారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు నక్కా సోమేశ్వరరావు, ఎ.ప్రసాదకుమార్, సీహెచ్ లూథర్ ఫ్రెడ్రిక్, కుసుమ సాయిబాబా, కొంకి రమేష్, వి.డేవిడ్‌రాజు, కె.శేషగిరిరావు, సీహెచ్ సరస్వతిరావు, డీఆర్‌పీ బాబు, ఎస్.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

2న నగర బ్రాహ్మణ కార్తీక సమారాధన

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): నగర బ్రాహ్మణ కార్తీక సమారాధన నవంబరు 2న స్థానిక జేఎన్ రోడ్డులోని ఆంధ్ర కేసరి జూనియర్ కళాశాలలో జరుగుతుందని జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాస్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని సీతంపేట మాతృస్వరూపిణి మందిరంలో అజ్జరపు హరిబాబు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేదపండితుడు శంకరం, నిడమర్తి వెంకట్, పందిరి మహదేవుడి సత్రం డైరెక్టర్ పవన్‌కుమార్, చింతపెంట రత్నప్రకాష్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీకి మించి విక్రయిస్తున్న దుకాణంపై కేసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రూ.110 విలువ గల డైరీ మిల్క్ చాక్లెట్‌ను రూ.115కి విక్రయిస్తున్న దుకాణం దారుడిపై లీగల్ అండ్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్‌కుమార్ కేసు నమోదు చేశారు. లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ సాయిరామ్ ఆదేశాల మేరకు గురువారం నగరంలో పలు చోట్లు దాడులు నిర్వహించారు. రైల్వేస్టేషన్‌లో ఒక దుకాణంలో డైరీ మిల్క్ చాక్లెట్ అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు గుర్తించి కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు పాల్గొన్నారు. ఎమ్మార్పీకి మంచి ధరలు విక్రయించే వారిపై 1915 టోల్‌ఫ్రీకి లేదా, ఎన్‌సీహెచ్ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చని ప్రశాంత్‌కుమార్ పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో అట్లతద్ది

రంగంపేట/రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరం, రంగంపేట మండలంలో అట్లతద్ది పర్వదినాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గురువారం తెల్లవారుజామున భోజనాలు చేసి, గోరింటాకు పెట్టుకొని ఉదయం ఉపవాసముండి రాత్రి తద్ది పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతీ, పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేసి, మహిళలు పరస్పరం అట్లు, పసుపు తోరణాలు తదితర సామగ్రితో వాయినాలు ఇచ్చిపుచ్చుకొని ఆశీస్సులు అందుకున్నారు.


వాయినాలు ఇచ్చిపుచ్చుకుంటున్న మహిళలు

బలభద్రపురంలో పూజలు

బిక్కవోలు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బలభద్రపురంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్మించిన శివాలయంలో ఈనెల 13న దేవతామూర్తులను ప్రతిష్ఠించనున్నారు. ఈ సందర్భంగా గురువారం అష్టాదశపీఠ దేవతా సహిత దేవతామూర్తులకు గ్రామోత్సవం జరిపారు. అనంతరం ఈ విగ్రహాలను సమకూర్చిన దాతలు వాటికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వాటిని జలాధివాసంలో ఉంచారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి, కమిటీ సభ్యులు దాతలు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాల పరిశీలన


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో

బిక్కవోలు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామంలోని నెం.1 ప్రాథమిక పాఠశాలను ఎంఈవో సీహెచ్‌వీవీ సత్యనారాయణ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థి తెలుగు, ఇంగ్లీషులో చదవడం, రాయడం, లెక్కలులో కూడిక, తీసివేత, గుణకారం, భాగహారాలు చేయడంలో పట్టు సాధించేలా తయారు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

అనపర్తి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీరా రామచంద్రపురంలో ఆకీరా కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరాన్ని బీజేపీ మండలాధ్యక్షుడు కర్రి బులిరెడ్డి ప్రారంభించారు. శిబిరంలో 120మంది వైద్య సేవలందించి 25 మందికి కళ్లజోళ్లను ఉచితంగా అందజేశారు. 13మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కర్రి శ్రీనివాసరెడ్డి, ద్వారంపూడి తాతారెడ్డి, శ్రీనివాసరావు, భువనేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆర్టీసీ
డయల్ యువర్ డీఎం

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ డీఎం ప్రోగ్రాం ఈనెల 11న ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ నిర్వహిస్తున్నామని రాజమహేంద్రవరం డిపో మేనేజర్ కె.మాధవ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల నుంచి సమస్యలను ఫోన్ ద్వారా స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆర్టీసీ ప్రయాణికులు నిర్దేశిత సమయంలో తమ సమస్యలను సెల్: 99592 25535 నెంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని ఆయన పేర్కొన్నారు.

బాగా చదువుకోవాలి

డీఎల్‌ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని, క్రమశిక్షణే మంచి భవిష్యత్తుకు పునాది అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర, ఎస్టీ బాలికల వసతి గృహాలను ఆమె సందర్శించారు. వసతి సదుపాయాలు, ఆహారం, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పలు విషయాలపై ఆరా తీశారు. ఎలాంటి సమస్యలు ఉన్నా డీఎల్‌ఎస్ఏ హెల్ప్‌లైన్ నెం.15100లో సంప్రదించాలని ఆమె సూచించారు.

పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ బహూకరణ

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని గౌతమీ ఘాట్ వద్ద నున్న రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్టు సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం స్థానిక ఓల్డ్ టౌన్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలకు రూ.50 వేలు విలువచేసే కంప్యూటర్, ప్రింటర్ అందజేశారు. కార్యక్రమంలో మద్దుల మురళీకృష్ణ, యియ్యపు మురళీధర్, బాలనాగు బాలేష్, దేవత సుధాకర్, మండవిల్లి వెంకటరాజు, లక్కోజు వీరభద్రరావు, శిఘాకొల్లి సీతారామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: అరి
సూర్యమినీ	: ట్రాన్
సూర్యప్యాలస్	: కాంతారా-1
స్వామి	: ఓజీ
అనుశ్రీ(సాయికృష్ణ)	: ఓజీ
శివజ్యోతి	: మమ్మీ ఈజ్ బ్యాక్
రాజా	: కాంతారా-1
ఊర్వశి	: కాంతారా-1
మేనక	: ఇడ్లీ కొట్టు
రంభ	: మిరాయ్
అప్సర	: ట్రాన్
అశోక	: కానిస్టేబుల్, శశివదనే
వీఎస్ మహల్(నామవరం)	: కాంతారా-1
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: కాంతారా-1
వెంకటసూర్య(కడియం)	: కాంతారా-1
సత్యగౌరి (అనపర్తి)	: ఓజీ
సూర్యశ్రీ (అనపర్తి)	: కాంతారా-1
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: కాంతారా-1
రామకృష్ణ(కోరుకొండ)	: మహావతార్ నరసింహ
గీతాసినిమాస్ (సీతానగరం)	: మహావతార్ నరసింహ
శ్రీనివాస (గోకవరం)	: కాంతారా-1
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ఓజీ
లలితామహల్(రంపచోడవరం)	: మహావతార్ నరసింహ
నవయుగ(చింతూరు)	: హరిహర వీరమల్లు



నేటి నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు

ఏడు వారాల వెంకన్నగా పిలుచుకునే.. వాడపల్లి వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభంకానున్నాయి. 18వ తేదీ వరకూ ఉత్సవాలు జరుగుతాయి. ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేశారు. - ఆత్రేయపురం

బదిలీ టైమ్..

రాజమహేంద్రవరం/చింతూరు/కాకినాడ కలెక్టరేట్/కాకినాడ కార్పొరేషన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా నలుగురు ఉన్నతాధికారులు బదిలీ అయ్యారు. వీరిలో ఇద్దరిని ఇక్కడే సర్దుబాటు చేసేశారు. కాకినాడ జేసీ రాహుల్ మీనా రాజమహేంద్రవరం కమిష నర్‌గా నియమితులయ్యారు.చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ కాకినాడ జేసీగా నియమితులయ్యారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్‌కు చింతూరు బాధ్యతలు అప్పగించారు. కాకినాడ కమిషనర్ భావన బాపట్ల జేసీగా బదిలీ అయ్యారు.

రాజమండ్రి కమిషనర్‌గా మీనా



రాజమహేంద్రవరం కార్పొరేషన్ కమిషనర్‌గా 2021 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి రాహుల్ మీనా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సి పల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.రాహుల్ మీనా ప్రస్తుతం కాకినాడ జాయింట్ కలెక్టర్‌గా ఏడాది పాటు పనిచేశారు. అంతకుముందు ఈయన మార్కాపురం సబ్ కలెక్టర్‌గా కూడా విధులు నిర్వహించారు.రాజమ హేంద్రవరం కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్‌గా కలెక్టర్ కీర్తి చేకూరి ఉన్నారు.

కాకినాడ జేసీగా అపూర్వ భరత్



చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌కు కాకినాడ జాయింట్ కలెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.2021 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన భరత్ 2024 ఆగస్టు 30న చింతూరు ఐటీడీఏ సబ్‌కలెక్టర్, ఐటీడీఏ పీవోగా బాధ్యతలు స్వీకరించారు.ఈ ఏడాది ఆగస్టు 25న శిక్షణ నిమిత్తం ఆయన డెహ్రాడూన్‌కు వెళ్లారు. నవంబరు 25న శిక్షణ పూర్తి కానుంది. భరత్ లక్నోలో గౌతమ్ బుద్ధ టెక్నికల్ యూనివర్శిటీ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ చేశారు.

కాకినాడ కమిషనర్ భావన బదిలీ



కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ భావన బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వం జీవో నెంబర్ 1844 విడుదల చేసింది. 2024 జూలైలో కాకినాడ కమిషనర్‌గా భావన బాధ్యతలు బాపట్ల జాయింట్ కలెక్టర్‌గా భావన బదిలీ అయ్యారు.

చింతూరు సబ్ కలెక్టర్‌గా శుభం నొక్వాల్



రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్‌కు చింతూరు సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవోగా ఎఫ్ఏసీ (ఫుల్ అడిషనల్) బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.దీంతో ప్రస్తుతం శుభం నొక్వాల్ సబ్ కలెక్టర్,ఐటీడీఏ పీవోగా కొనసాగుతారు.





గేదెల పేడ, యూరిన్ పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది.. మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ డీడీ సత్యనారాయణ

పెద్దేవంలో అంతుచిక్కని వ్యాధి

ఆగని గేదెల మరణాలు.. మూడో సారి మళ్లీ పరీక్ష

తాళ్లపూడి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దేవం గ్రామంలో గేదెలకు సోకిన వ్యాధి అంతుచిక్కలేదు.. నేటికీ గేదెలు మృతిచెందుతూనే ఉన్నారు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడో విడతగా గురువారం అనారోగ్యంతో మృత్యువాత పడుతున్న గేదెలకు మరికొన్ని పరీక్షలు నిర్వహించారు. గేదెల పేడ, మూత్రానికి పరీక్షలు చేశారు. పశు సంవర్ధక శాఖ డీడీ డా. ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామంలో 50 మంది రైతులు వారి గేదెలకు పరీక్షలు చేయించగా 90 శాతం గేదెల్లో పొట్ట జలగ వ్యాధి ఉన్నట్లుగా గుర్తించామని తెలిపారు. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు మృత్యువాత పడిన గేదెకు పోస్టుమార్టం నిర్వహించి జరిపిన పరీక్షల్లో రెండు వైరస్‌లు గుర్తించినట్లు తెలిపారు. గ్రామంలోని సుగంధి చెరువులో ఉన్న విషపూరిత అవశేషాల కారణంగా గేదెల్లో వ్యాధి నిరోధకశక్తి నశించి వైరస్ పెరుగుతుందన్నారు. వ్యాధి సోకిన గేదెలకు మిశ్రమ రోగాల నివారణకు మందులిస్తున్నామన్నారు. గ్రామ ఉప సర్పంచ్ తోట రామకృష్ణ మాట్లాడుతూ గేదెలకు రోగ నిర్ధారణ చేసి సరైన మం దులు ఇవ్వాలన్నారు.ప్రభుత్వం గేదెలు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఏడీ డా.వెంకటరెడ్డి, కాకినాడ ల్యాబ్‌కి చెందిన డా.సందీప్, డా వెంకటేశ్వరరావు, డా ఎస్.వరలక్ష్మి పాల్గొన్నారు.

పరాన్నజీవులు.. వైరల్ ఇన్ఫెక్షన్ కారణం : కలెక్టర్

రాజమహేంద్రవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పెద్దేవం గ్రామంలో పాడిడేదెలు మృతికి పరాన్నజీవులు, వైరల్ ఇన్ఫెక్షన్ల సమ్మేళనమే కారణమని పరీక్షల్లో గుర్తించినట్టు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు.ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుల చేశారు. గేదెల ఆకస్మిక మృతిపై జిల్లా యంత్రాంగం సమగ్ర పరిశీలన చేసి, పశుసంవర్ధక శాఖ నిపుణుల బృందాలు క్షేత్ర పరిశీలన చేసి నిర్వహించిన నమూనాలను ప్రయోగశాలలో పరిశీలన చేయించినట్టు తెలిపారు. బాధిత పశువులకు అవసరమైన వైద్య సహాయం, డీ వార్మింగ్, కీటక నియంత్రణ చర్యలు ప్రారం భించినట్టు చెప్పారు. గ్రామంలోని అన్ని పశు వులకు ఉచిత వైద్యం, సలహాలు అందించేందుకు మొబైల్ వెటర్నరీ టీమ్‌లను పంపినట్టు చెప్పారు.రైతులు తమ పశువుల్లో అనారోగ్య లక్షణాలు గమనించిన వెంటనే సమీప వెటర్నరీ డాక్టర్లకు గానీ, గ్రామ సచివాలయ సిబ్బందికి గానీ సమాచారం ఇవ్వాలని సూచించారు. చెరువులు, బురద ప్రాంతాల్లో పశువులను మేపవద్దని, గొర్రెలు, మేకలతో కలిపి మేపవద్దని.. జిల్లా పశుసంవర్ధక అధికారి టి.శ్రీనివాస్ తెలిపారు.

మీ సమస్యలన్నీ పరిష్కరిస్తా..



ఉప్పాడ సభలో మాట్లాడుతున్న పవన్

ఇదే నా ఆన!

ఉప్పాడ సభలో డిప్యూటీ సీఎం పవన్

- వంద రోజులు గడువు ఇవ్వండి
- పారిశ్రామిక కాలుష్యంపై ఆడిట్
- మత్స్యకారుల ఆవేదనకు బాధపడ్డా
- అందుకే మీ ముందుకు వచ్చా
- మీకు న్యాయం చేస్తా
- పవన్ హామీతో ఆనందం

(కాకినాడ,యు.కొత్తపల్లి,పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

మత్స్యకారుల సమస్యలను వంద రోజుల్లో పరిష్కరిస్తామని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు.పిఠాపురం నియోజకర్గం యు.కొత్తపల్లి మండలం ఉప్పాడలో పవన్‌కల్యాణ్ గురువారం సాయంత్రం బహిరంగ సభలో ప్రసంగించారు. సముద్రంలో కలుస్తున్న పారిశ్రామిక వ్యర్థ జలాలు ఏ మేరకు ఉన్నాయనే దానిపై ఆడిట్ చేయడానికే వంద రోజుల గడువు అని తెలిపారు. నాలుగు రోజులు ధర్నా చేస్తే ఐదో రోజే పరిష్కారం అవదని.. మ త్స్యకారులు అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేను మీలో ఒకడిని..

తాను డిప్యూటీ సీఎం..పిఠాపురం ఎమ్మెల్యేను కాదని..మత్స్యకారుల్లో ఒకడినని పవన్ సభలో పేర్కొనడంతో చప్పట్లు మార్మోగాయి.మత్స్యకారులంటే నాకు అభిమానం, ప్రేమ. మిమ్మల్ని ఎగదోసి పబ్బం గడుపుకునే నాయకులను మాత్రం నమ్మవద్దన్నారు.ఉప్పాడ కొత్తపల్లి మండలంలో మత్స్యకారులు కొంతకాలం కిందట నాలుగు రోజులు ధర్నాలు, ఆందోళనలు చేసిన విషయం తన దృష్టికి వచ్చిందన్నారు.మత్స్య సంపద అంతరించిపోతుందనే వారి ఆవేదన తనకు బాధ కలిగించిందన్నారు.అందుకే సమస్య పరిష్కారానికి ఏం చేయాలనేదానిపై అధికారులు, అన్ని పార్టీలు, మత్స్యకార సంఘాల నాయకులతో కలెక్టరేట్‌లో గురువారం ఉదయం సమావేశమై చర్చించినట్టు వివరించారు. ఆరోగ్యం బాగోలేక వెంటనే రాలేకపోయానని..ఈ నెల 10న వస్తానని చెప్పినా ప్రజల కోసం ఒకరోజు ముందుగానే వచ్చానన్నారు. మత్స్య కార సంఘాల నేతలు తన దృష్టికి తెచ్చిన సమస్యలను పవన్ కల్యాణ్ సభలో ఒక్కొక్కటిగా వివరించారు. నక్కపల్లి,కాకినాడ సెజ్‌లు, దివీస్, అరబిందో, డెక్కన్ తదితర పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యంవల్ల వేట దొరకడం లేదని మత్స్యకారులు తెలిపారని, ఇవి కాంగ్రెస్ ప్రభు త్వంలో వచ్చాయన్నారు.ఈ కాలుష్యం ఏ స్థాయిలో ఉందనేది మత్స్యకా రులు తనకు వివరించారని..అందుకే మూడు రోజుల్లో కాకినాడ పోర్టు నుంచి సముద్రంలోకి వెళ్లి కాలుష్యం జాడలను పరిష్కరిస్తానని పవన్ హామీ ఇచ్చారు.అమీనాబాద్ హార్బర్ డిజైన్ లోపం వల్ల పడవలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్న విషయమై సమస్య పరిష్కరిస్తామన్నారు. స్థానికంగా మత్స్యసంపద దొరకనప్పుడు అంత ర్వేది, మచిలీపట్టణం, నిజాంపట్నం తదితర ప్రాంతాలకు వేటకు వెళ్తే ఇబ్బంది పెడుతున్నారన్న విషయమై ఇప్పటికే మంత్రి కొల్లు రవీంద్ర,రాజోలు ఎమ్మెల్యేతో చర్చించగా, సమస్య పరిష్కారమైందన్నారు.ఇక నుంచి ఉప్పాడ మత్స్యకా రులు వేటకు అటువైపు వెళ్ల వచ్చని ప్రకటించారు.రింగుల వలలు వాడొద్ద న్నారు. ఎన్ని ఇబ్బందులు పడినా ఉప్పాడ రక్షణ గోడ నిర్మించడం తథ్యం అన్నారు. ఉప్పాడ-కోనపాపపేట తీర ప్రాంతంలో రూ.5.72 కోట్లతో రహదారులు నిర్మిస్తున్నామన్నారు. పది రోజుల కోసారి డిప్యూటీ సీఎం కార్యాలయం, కూటమి నాయకులు ద్వారా ఎప్పటికప్పుడు జరుగుతున్న విషయాలను తెలియజేస్తారన్నారు.



చూడండి సార్ : పవన్‌తో మాజీ ఎమ్మెల్యే వర్మ

పర్యటన సాగిందిలా..

ఉదయం 10.30 గంటలకు పవన్ హెలీకాప్టర్‌లో కాకినాడ పోలీసు పరేడ్ గ్రౌండ్‌కు చేరుకున్నారు.అక్కడి నుంచి 11.30 గంటలకు కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. అనంతరం 2.30 గంటలకు జీఆర్టీ హోటల్‌కు చేరుకుని పార్టీ నేతలతో ముచ్చటించారు. సాయంత్రం ఉప్పాడలో సభ ముగించుకుని హెలీకాప్టర్‌లో రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకుని తిరిగి వెళ్లారు.



కలెక్టరేట్‌లో మత్స్యకార సమస్యలపై చర్చిస్తున్న పవన్, కలెక్టర్ షాన్‌మోహన్, ఎంపీ ఉదయ్ తదితరులు

నిబంధనలు గాలికి..



ప్రాణాలు బుగ్గికి!

అధికారులకు పట్టని ఉల్లంఘనులు

- అక్రమంగా బాణసంచా కేంద్రాలు
- పట్టించుకోని అధికారులు
- తూతూమంత్రంగా దాడులు
- రాయవరం ఘటనతో ఉలికిపాటు
- ప్రత్యేక బృందాల ఏర్పాటు
- అధికారులతో కలెక్టర్ సమీక్ష


(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

బాణసంచా తయారీ, విక్రయాల్లో నిబంధనల ఉల్లంఘనలు జరుగుతున్నా సంబంధిత ప్రభుత్వ శాఖలకు కానరావడంలేదు.. మామూళ్ల మత్తులో అధికారులు తనిఖీలకు దూరమవడంతో ప్రతీ ఏడాది దీపావళికి ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కుటుంబాలను చిన్నాభిన్నమవుతున్నాయి.అయినా అధికారులు చేపట్టే చర్యలు మాత్రం శూన్యం. జిల్లాలోని చాగల్లు, బిక్కవోలు మండలం కొమరిపాలెం తదితర ప్రాంతాల్లో బాణసంచా తయారీ కేంద్రాలు ఉన్నాయి. సొంతంగా తయారుచేసి విక్రయిస్తారు. అంతా తెలిసినా అధికారులకు మాత్రం పట్టడంలేదు. తూతూమంత్రపు తనికీలతో తుస్‌మనిపిస్తున్నారు. ప్రమాదాలు జరిగిగే బతుకులు బాంబుల్లా పేలిపోతున్నాయి. బుధవారం జరిగిన సంఘటనే అందుకు ఒక ఉదాహరణ. ఒక చిన్న చిచ్చుబుడ్డి కారణంగా ఏడుగురు బతుకులు బుగ్గిపాలయ్యాయి. అయినా అధికారుల్లో మాత్రం నేటికీ పూర్తి చలనం లేదు.

జిల్లాలో 11 లైసెన్స్‌డ్ కేంద్రాలు..

తూర్పుగోదావరి జిల్లాలో 11 మంది ఏడాది పొడవునా తయారు చేసే లైసెన్సులు కలిగి ఉన్నారు. వీళ్ల ఆర్డరుపై మాత్రమే తయారు చేసి విక్రయించాలి. దుకాణాలకు అమ్మకూడదు. ఈ కేంద్రాలు జనావాసాలకు కచ్చితంగా దూరంగా ఉండాలి. క్రాకర్ తయారీ, విక్రయ కేంద్రాలను పోలీస్, రెవెన్యూ, ఫైర్ శాఖల సిబ్బంది ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలి. కానీ ఎవరికి వారే యమునాతీరే అనే విధంగా పరిస్థితులు ఉన్నాయి. దీపావళి సమీపిస్తున్నా కనీసం ప్రజలకు అవగాహన కల్పించడంపై కూడా దృష్టి సారిం చడంలేదు. ఫ్యాక్టరీస్ డిపార్ట్‌మెంట్ సేఫ్టీ నిబంధనలు కఠినంగా ఉంటాయి. కానీ మందు గుండు సామగ్రి తయారీ కేంద్రాలు తమ పరిధిలోకి రావంటూ ఆ శాఖాధికారులు చేతులు కట్టుకొని చూస్తున్నారు.నిబంధనల ప్రకారం దీపావళి టపాసులు తయారు చేసి విక్రయించ డానికి వీల్లేదు.వేరే రాష్ట్రాల నుంచి హోల్‌సేల్‌గా తెచ్చుకున్న వాళ్ల దగ్గర నుంచి రిటైల్ వ్యాపా రులు కొనుగోలు చేసుకుని విక్రయించాలి.ఎవరికీ ఇవేమీ పట్టడం లేదు. ఎంత ముడి సరుకు తీసుకొస్తున్నారు. ఏమి తయారు చేస్తున్నారు. ఎవరికి విక్రయిస్తున్నా రనే అంశాలపై నిఘా కొరవడింది.ఏడాది పొడవునా తయారు చేయడానికి లైసెన్సు తీసుకున్న వాళ్లు 15 కిలోలకు మించి తమ వద్ద ముడి సరుకు నిల్వ ఉంచకూడదు. షెడ్లను సిమెంటు రేకులతో 45 మీటర్ల దూరం ఉండే విధంగా నిర్మించుకోవాలి. వీటికి కరెంటు కనెక్షన్ ఉండకూడదు. రాత్రి వేళల్లో పని చేయ కూడదు. నీళ్ల తోడుకోవడం తదితర అవస రాలకు డీజిల్ జనరేటర్‌ని వాడాలి. కార్మికులు లూజుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి. దూరంగా కూర్చొని క్రాకర్స్ తయారు చేయాలి. ఎవరైనా ప్రాణాలు కోల్పోయిన తర్వాత హడావుడి చేస్తూ నివేదికలతో చేతులు దులుపుకుంటున్నారు.

తనిఖీలకు బృందాలు



అనుమతులు ఉన్నవాళ్లు నిబంధనలకు లోబడి వ్యాపారాలు చేయాలి. అక్ర మంగా తయారు చేసినా,నిల్వ ఉంచినా, విక్రయాలు జరిపినా క్రిమినల్ కేసులు తప్ప వు.జిల్లావ్యాప్తంగా ప్రతి రోజూ ఆకస్మిక తని ఖీలు చేయడానికి బృందాలను ఏర్పాటు చేశా ం. అక్రమ తయారీ, నిల్వ, విక్రయాలపై 112కి సమాచారం ఇవ్వాలని కోరారు. అవసరమైతే వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. - కిశోర్‌కుమార్, ఎస్పీ

నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు: కలెక్టర్



రాజమహేంద్రవరం,అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బాణాసంచా తయారీ, అమ్మకాల్లో నిబంధనలు కచ్చితంగా పాటించాలని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. బాణసంచా తయారీదారుల సంఘాల ప్రతినిధులు,సమన్వయ శాఖల అధికారులతో గురువారం కలెక్టర్ సమీక్షించారు. ప్రమాదాలకు తావులేకుండా పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టాలని..నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నిశిత పరిశీలన తర్వాతే అనుమతులు మంజూరు చేయాలన్నారు. అనుమ తుల్లేకుండా నిర్వహిస్తుంటే చర్యలు తీసుకోవాలని సూచించారు.రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖల అధికారులు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేయాలన్నారు.కార్యక్రమంలో జేసీ మేఘస్వరూప్, అదనపు ఎస్పీ మురళీకృష్ణ,డీఆర్వో సీతారామ మూర్తి, ఆర్డీవోలు కృష్ణ నాయక్, రాణి సుస్మిత, డీఎస్పీలు దేవకు మార్, భవ్య కిషోర్, జిల్లా ఫైర్ ఆఫీసర్ మార్టిన్ లూథర్ కింగ్, ఏఎల్‌సీ వలీ పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో ఆర్థిక లాభం

ఫిర్యాదులుంటే డయల్ 1800 1200 232

డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

దివాన్‌చెరువు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 సంస్కరణలతో మందులు, వైద్య పరికరాలు, బీమా ప్రీమియంలపై పన్ను తగ్గడం ద్వారా ప్రజలకు గణనీయమైన ఆర్థిక లాభం కలుగుతుందని డీఎంహెచ్‌వో డాక్టర్ కె. వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రాజానగరం మండలం పాలచర్ల పీహెచ్‌సీలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహనకు గురువారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. మందులపై పన్ను రద్దు చేయడం, వైద్యసేవలపై జీఎస్టీ తగ్గించడం ప్రజలకు ఊరట కలిగించే నిర్ణయాలన్నారు. జీఎస్టీ 2.0కు సంబంధించిన ఫిర్యాదులను తూర్పుగోదావరి జిల్లా కంట్రోల్‌రూమ్ నెంబరు 87126 31290, టోల్ ఫ్రీ నెంబరు 1800-1200-232, వాణిజ్య పన్నుల శాఖ 0866- 2821183 నెంబరుకు తెలుపవచ్చునన్నారు. వినియోగదారుల బిల్లుల్లో జీఎస్టీ తగ్గింపులు అమలు కాకపోవడం, అధిక పన్నుల వసూలు వంటి అంశాలపై ఫిర్యాదు చేయాలంటే 1915కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కోమలి, పాలచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బెనడిక్ట్, నాయకులు గంగిశెట్టి చంటిబాబు, గంగిశెట్టి వసంతరాయుడు, రాజేంద్రప్రసాద్, బిందుశేఖర్ పాల్గొన్నారు.



ఇస్తినమ్మా వాయినం..





రాజమహేంద్రవరం పుష్కరఘాట్ గురువారం మహిళలతో కిటకిటలాడింది.. అట్లతద్ది సందర్భంగా గోదావరి రేవులో పెద్ద ఎత్తున పూజలు చేశారు.. గోదావరిలో దీపాలు వదిలారు.. ముత్తయిదువులకు ఇస్తినమ్మా వాయినం.. పుచ్చుకుంటినమ్మా వాయినం అంటూ ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు..
- రాజమహేంద్రవరం సిటీ

రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు ఆకస్మిక తనిఖీలు



వేములూరులో విద్యార్థులతో మాట్లాడుతున్న లక్ష్మీరెడ్డి

కొవ్వూరు/ చాగల్లు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు, చాగల్లు మండలాల్లో రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు ఇ.లక్ష్మీరెడ్డి గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వేములూరు, పశివేదలలోని అంగన్వాడీ సెంటర్లు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థుల నుంచి ఆహార నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ సెంటర్లు, పాఠశాలల్లో వంటశాలలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారిణి బీ.శశాంక, డీఎం. గణేష్, ఏఏఎస్‌వో ఎం.నాగాంజనేయులు, ఏజీపీవో ఎం.రంగప్రసాద్, ఫుడ్‌సేఫ్టీ అధికారి సుప్రియ, తదితరులు పాల్గొన్నారు. అలాగే చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నెలటూరు ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం పథకం అమలుతీరును పరిశీలించారు. అనంతరం ఊనగట్ల ఎంఎస్ఎల్ పాయింట్‌ను తనిఖీ చేశారు. ఈయనతోపాటు జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి బీ. శశాంక, డీఎం గణేష్‌కుమార్, ఏఏఎస్‌వో ఎం. నాగాంజనేయులు, తదితరులు ఉన్నారు.

ఘనంగా నాదెళ్ల శ్రీరామ్ పుట్టిన రోజు వేడుకలు



చాగల్లులో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి, కూటమి నాయకులు

చాగల్లు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి పుట్టినరోజు వేడుకలు అభిమానుల సమక్షంలో గురువారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని శ్రీరామ్ చౌదరి చేత కేక్ కటింగ్ చేయించి, శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. దేశ భవిష్యత్ యువత చేతిలో ఉందని, రాష్ట్ర అభివృద్ధి, పార్టీ పటిష్టతే లక్ష్యంగా యువత ఉత్సాహంగా పనిచేయాలన్నారు. టుమెన్ కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, టీడీపీ నాయకులు ఆళ్ల హరిబాబు, కేతా సాహెబ్, సూరపనేని చిన్ని, బొల్లిన శివనాగేంద్ర, ఈడుపుగంటి సుబ్బారావు, బొడ్డు కేశవ కుమార్, మండలంలోని ఆయాగ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కూటమి నాయకులు విచ్చేసి శ్రీరామ్ చౌదరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

నిరసన ర్యాలీకి తరలిన టీడీపీ దళిత నేతలు



కొవ్వూరు టీడీపీ కార్యాలయం నుంచి వెళ్తున్న దళిత నాయకులు

కొవ్వూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడాన్ని నిరసిస్తూ గురువారం రాజమహేంద్రవరంలో జరిగే నిరసన ర్యాలీకి అధికసంఖ్యలో దళిత నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. నియోజవర్గ టీడీపీ కార్యాలయం వద్ద నిరసన ర్యాలీని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంబించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని అవమానపర్చిన వ్యక్తిని రాజద్రోహిగా పరిగణించి, కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో మరపట్ల కళాధర్, వరిగేటి కాంత రాజు, కొప్పాక జవహర్, వేమగిరి వెంకట్రావు, కె. విజయ్‌కుమార్, బొంతా కిషోర్, బహద్దూర్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో బోధనేతర కార్యక్రమాలు బహిష్కరణ

తాళ్లపూడి, అక్టోబరు 9 ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పాఠశాలల్లో బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్టు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో -2 నెహ్రూజీకి వినతి పత్రం అందించామని తెలిపారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్ర మంలో యాదం శంకరం, విజయ్‌కుమార్ రాజు, రామకృష్ణ, చెల్లాజీరావు, రవి, వెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు.

పుష్కరాలపై ప్రణాళికలు సిద్ధం చేయాలి

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి, ఆర్డీవో

కొవ్వూరు, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): రానున్న గోదావరి పుష్కరాలకు దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆర్డీవో రాణీసుస్మిత అన్నారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో గోదావరి పుష్కరాల నిర్వహణపై వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆర్డీవో శాఖల వారీగా అధికారులతో మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పుష్కరాలకు రాజమహేంద్రవరంతోపాటు కొవ్వూరులో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందన్నారు. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధికంగా కొవ్వూరులో పుణ్యస్నానాలు ఆచరించడానికి వస్తారన్నారు. దీనికోసం రాష్ట్ర స్థాయిలో ఐఏఎస్‌లతో ఒక కమిటీ వేశారన్నారు. అలాగే మంత్రులతో మరో కమిటీ వేయనున్నారన్నారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో ప్రతిపాదిత పనులపై సమగ్ర నివేదిక అందజేయాలన్నారు. రాజమహేంద్రవరం కంటే కొవ్వూరు వైపు గోదావరి జలాలు కలుషితం కాకుండా తాజాగా ఉండడంతో రాజమహేంద్రవరం వైపు నుంచి కొవ్వూరు వచ్చి అత్యధికంగా స్నానాలు చేస్తారన్నారు. గతం కంటే భక్తులు అత్యధికంగా వచ్చే అవకాశం ఉన్నందున, 2015 కంటే ఏర్పాట్లు పెంచాలన్నారు. విజ్జేశ్వరం దగ్గర నుంచి తాడిపూడి వరకు గతంలో ఎన్ని ఘాట్లు ఉన్నాయి. కొత్తగా ఎన్ని అవసరం.. స్నానఘట్టాల అభివృద్ధి, దేవాలయాల మరమ్మతులు, భక్తుల సౌకర్యార్థం అవసరమైన పనులపై ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఆర్డీవో మాట్లాడుతూ డివిజన్ పరిధిలో గోదావరి తీరంలో 48 పుష్కర ఘాట్లు ఉన్నాయని, వాటి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయితీరాజ్, ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో నిర్మాణపనులకు నివేదికలు సిద్ధం చేయాలన్నారు. డివిజన్‌లోని 67 దేవాలయాల అభివృద్ధికి రూ. 9.87 కోట్ల నిధులు మొదటి విడతగా మంజూరు అయ్యాయన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ జీ.దేవకుమార్, ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, సూరపనేని చిన్ని, దేవాదాయశాఖ జిల్లా అధి కారి పీవీ సుబ్బారావు, ఇరిగేషన్ డీఈఈ కే.ఆనందబాబు, ఏఈ జీ.మణికంట రాజు, తహసిల్దార్ ఎం.దుర్గాప్రసాద్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, ఫైర్ అధికారి ఏవీ ఎస్ఎన్.వేణు, ఎలక్ట్రికల్ ఏడీఈ కృష్ణనాయక్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యేలు

● పుష్కరాలకు నిధులు ఇవ్వాలని ముప్పిడి వినతి ● నియోజకవర్గానికి నిధులు కేటాయించడంపై మద్దిపాటి కృతజ్ఞతలు



సీఎంకు కలిసి పుష్కరాల గురించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



గోపాలపురం నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

కొవ్వూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రానున్న గోదావరి పుష్కరాలకు కొవ్వూరు నియోజకవర్గానికి నిధులు కేటయించాలనే ప్రతిపాదనను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి అందించినట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇప్పటి వరకు నియోజకవరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఈ మేరకు 2027 సంవత్సరంలో రానున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి దేశం నలుమూలల నుంచి భక్తుల రద్దీకి అనుగుణంగా చేపట్టాల్సిన స్నానఘట్టాలు, రోడ్లు, తాగునీరు, విద్యుదీకరణ, పారిశుధ్య నిర్వహణ వంటి పలు అంశాలపై తయారుచేసిన ప్రతిపాదనలను అందజేశారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారన్నారు.

గోపాలపురం: రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో గురువారం జరిగిన ప్రత్యేక సమావేశానికి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు హాజరయ్యారు. అనంతరం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఆధికారంలోకి వచ్చాక గోపాలపురం నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు విడుదల చేసినందుకు గాను మద్దిపాటి కృతజ్ఞతలు తెలిపారు. గడిచిన 17 నెలల్లో కోట్లాది రూపాయలు కేటాయించడంతోపాటు సీఎం సహాయ నిధి కింద రూ. 6 కోట్లు మంజూరు చేశారన్నారు. అలాగే రానున్న రోజు ల్లోనూ అధిక నిధులు కేటాయంచాలని కోరాన న్నారు. నియోజకవర్గంలో రేయింబవళ్లు కష్టపనిచేస్తున్నందుకు గాను ప్రశంసించారన్నారు.

నేడు, రేపు ఎక్స్‌పో

రాజమహేంద్రవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అమలులోకి వచ్చిన జీఎస్టీ 2.0 విధానం వల్ల వివిధ వస్తువులపై తగ్గిన పన్ను రేట్లపై వ్యాపారులకు, ప్రజలకు అవగాహన కల్పించడానికి శుక్ర, శనివారాల్లో డిస్ట్రిక్ట్ ఎలక్ట్రానిక్ ఎగ్జిబిషన్ సేల్ అండ్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్టు రాజమహేంద్రవరం (తూర్పు, కోనసీమ జిల్లాల) జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఎం.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

వేడుకగా అట్లతద్ది



చాగల్లు రాజరాజేశ్వరి విద్యాలయలో జరిగిన వేడుకలో పాల్గొన్న విద్యార్థులు

చాగల్లు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మహిళలు గురువారం అట్లతద్ది వేడుకలను సంప్రదాయ బద్ధంగా జరుపుకున్నారు. మహిళలు వేకువనే లేచి భక్తిశ్రద్ధలతో గౌరిదేవికి పూజలు నిర్వహించారు. రోజంత ఉపవాస దీక్షలో ఉండి సాయంత్రం దేవాలయాలకు వెళ్లి దైవ దర్శనం చేసి పూజలు నిర్వహించారు. మహిళలు ఉయ్యాల ఊగి సందడి చేసారు. మండల కేంద్రమైన చాగల్లు శ్రీరాజరాజేశ్వరి విద్యాలయలో ఉపాధ్యాయులతో కలిసి బాలికలు అట్లతద్ది వేడుకల్లో పాల్గొన్నారు. ఆటపాటలతోను, ఊయ్యాల సయ్యాటలతో సరదగా గడిపారు. పిల్లలకు మన సంస్కృతి సంప్రదాయాలపై విద్యాలకు అవగాహన కల్పించారు.

తపాలా దినోత్సవం



పోస్ట్‌మెన్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

తాళ్లపూడి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి శ్రీవిజేత ఉన్నత పాఠశాలలో గురువారం ప్రపంచ తపాలా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం జే. ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తపాలా శాఖ సిబ్బందిని ముఖ్యఅతిథులుగా ఆహ్వానించారు. కార్యక్రమంలో తాళ్లపూడిలో పోస్ట్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న నాగలింగాన్ని సత్కరించి మెమెంటోను అందించారు. కార్యక్రమంలో నాగలింగం మాట్లాడుతూ తపాలా శాఖలో లభించే సేవలు గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కే. కరుణ, చంద్రిక, వెంకట్, సలోమీ, గంగా రత్నం, ఆలీ, హేమ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు సత్కారం



అవార్డు పొందిన నిర్మలను సత్కరిస్తున్న దృశ్యం

పెరవలి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర అవార్డుకు ఎంపికైన ముక్కామల అంగన్‌వాడీ కార్యకర్త అరిగెల నిర్మలను గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అరిగెల అరుణ కుమారి, తదితరులు ఆమెకు శాలువాను కప్పి పుష్పగుచ్ఛాలను అందించారు. కార్యక్రమంలో కాలదాసి ప్రభావతి, మేడే నాగరాజు, మాకా నాగాంజనేయులు, రొంప బంగారయ్య, మారుమూడి సురేంద్ర, అరిగెల నాగరాజు, అరిగెల రాఘవశ్రీను, అరిగెల జాంపండు పాల్గొన్నారు.

మృత్యువుతో పోరాడి ఓడిన విజయలక్ష్మి

జీజీహెచ్ (కాకినాడ) / రాయవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) కోనసీమ జిల్లా రాయవరం మండలం కొమరిపాలెం బాణసంచా విస్ఫోటనంలో తీవ్ర గాయాలపాలై కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విజయలక్ష్మి మృత్యువుతో పోరాడి బుధవారం అర్ధరాత్రి తుది శ్వాస విడిచింది. వివరాలిలా ఉన్నాయి. రాయవరం మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన వాసంశెట్టి విజయలక్ష్మి (45) కు భర్త వెంకట్రావు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కాగా వెంకట్రావు వ్యవసాయ కూలి కావడంతో భర్తకు ఆర్థికంగా ఆసరాగా ఉండాలన్న ఉద్దేశంతో గత ఏడాది కాలంగా కొమరిపాలెం శివారులో ఉన్న శ్రీలక్ష్మీగణపతి గ్రాండ్ ఫైర్ వర్క్సులో తన కుమార్తె దుర్గతో పాటు వెళ్లి బాణసంచా కార్మికులుగా పనిచేస్తున్నారు.

షూటింగ్ బాల్ పోటీల్లో సాహితికి కాంస్యం

జేఎన్టీయూకే, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకేలోని యూసీఈకే ఏఐఎంఎల్ విద్యార్థిని కె.సింధూర సాహితి 8వ అంతర జిల్లాల షూటింగ్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. ఈ పోటీలు సెప్టెంబరు 25, 26 తేదీల్లో కర్నూల్‌లో జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థిని వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్, డైరెక్టర్ కృష్ణమోహన్ అభినందించారు.

సూపర్ జీఎస్టీపై అవగాహన

తాళ్లపూడి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్‌టీ - సూపర్ సేవింగ్స్ అనే కార్యక్రమాన్ని తాళ్లపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వద్ద డాక్టర్ హారికా గుప్త ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రాణ రక్షక మందులు, ఆరోగ్య బీమా, తదితర ముఖ్యమైన వస్తువులపై తగ్గిన జీఎస్‌టీ రేట్ల గురించి వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాయ్, హెల్త్ విజిటర్ బేగం, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: జీఎస్టీలో తగ్గిన ధరలు పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వేలివెన్ను పీహెచ్‌సీ సూపర్‌వైజర్ కె. సుభాషిణి పేర్కొన్నారు. గురువారం వేలివెన్ను ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో జీఎస్టీపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. జీఎస్టీలో రోజువారీ నిత్యావసర వస్తువులతోపాటు మందులు, ఆరోగ్య జీవిత బీమా, స్టేషనరీ, కిరాణా వస్తువులు, దుస్తులు, కార్లు, ట్రాక్టర్లు, మోటార్ సైకిళ్లు, టీవీ, తదితర వస్తువులపై జీఎస్టీని తగ్గించిందని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

ఉండ్రాజవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని మండల శానిటేషన్ కోఆర్డినేటర్ కె. ప్రకాశ్ పేర్కొన్నారు. గురువారం వెలగదుర్రులో ఎస్‌డబ్ల్యూఎం షెడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వాడకం గ్రామాల్లో నిషేధించుటకు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు నుంచి తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి త్రివేణి, సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0తో పేదలకు అందుబాటులో వైద్యసేవలు

● డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఎం.పద్మ



వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పద్మ

కొవ్వూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్రం చేసిన జీఎస్టీ 2.0 సంస్కరణలతో పేదలకు వైద్యసేవలు మరింత అందుబాటులోకి వచ్చాయని జిల్లా ఆసుపత్రుల సమమన్వయ అధికారిని (డీసీహెచ్‌ఎస్) డా.ఎం.పద్మ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆసుపత్రి నుంచి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి జీఎస్టీ తగ్గింపు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజేంద్రప్రసాద్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సెపక్‌తక్రా పోటీలకు ఎంపికలు

దేవరపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా అసోసియేషన్ జూనియర్ బాలుర, బాలికల సెపక్‌తక్రా పోటీలు మండలంలోని రామన్నపాలెంలో గురువారం నిర్వహించారు. ఈ క్రీడల్లో వంద మంది క్రీడాకారులు పాల్గొన్నారని రాష్ట్ర శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ తెలిపారు. ఇందులో జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 11, 12 తేదీల్లో బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. సెపక్‌తక్రాకు ఎంపికైన బాలురు కోట సతీశ్, ఎం.అఖిల్, వై.పాల్, వై.ఆంథోని, బీ.చరణ్, ఎం.సతీశ్, వివేక్, రాధాకృష్ణ, బాలికలజట్టుకు దుర్గామాదవిశ్రీ, ఎం.మహాలక్ష్మి, ఎం.లాస్య, ఎస్‌కే మనీషబేగం, ఎం.తేజస్వీ, డీ.సౌజన్య, కే.సుబాషిణి, తదితరులు ఎంపికైనటక్లొ చెప్పారు. కార్యక్రమంలో పీఈటీలు ఓరుగంటి రామకృష్ణ, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి

● గోపాలపురం ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ

గోపాలపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తే గ్రామాలభివృద్ధి జరుగుతుందని ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధుల ఒకరికి ఒకరు సహకరించుకోవాలన్నారు. గ్రామాల్లో తాగునీరు, వీధిలైట్లు, పారిశుధ్యం, తదితర సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టి ప్రజల అవసరాలను తీర్చేదిశగా ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.సుజాత, ఈఓ ఏఎం మంగతాయారు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయాశాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పొగాకులో యాజమాన్య పద్ధతులు అవసరం

● పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్



సంగాయిగూడెంలో నారుమడులను పరిశీలిస్తున్న పొగాకు బోర్డు అధికారులు

దేవరపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పొగాకు పండించే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని రాజమహేంద్రవరం పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్ పేర్కొన్నారు. సంగాయిగూడెం, గాంధీనగరం పొగాకు పండించే రైతులకు పొగాకు నారుమడులు, తీసుకోవల్సిన జాగ్రత్తలు, పొగాకు పంట, సస్యరక్షణపై రైతులకు గురువారం అవగాహన సదస్సును నిర్వహించారు. సంగాయిగూడెంలో నారుమడులు పరిశీలించి అనంతరం పొగాకు రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జీఎల్‌కే ప్రసాద్ మాట్లాడుతూ నారుమడి పెంపకంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని పొగాకు నారుకు తెగుళ్ల పురుగు మందుల వాడకంపై శాస్త్రవేత్తల సూచనలు పాటించాలన్నారు. పొగాకు బోర్డు నిబంధనల మేరకే రిజిస్ట్రేషన్ పొందిన రైతులకు మాత్రమే నారు విక్రయించాలని సూచించారు. ప్రపంచ దేశాల్లో పొగాకు ఉత్పత్తి 3762 మిలియన్‌కిలోల నుంచి 4197 మిలియన్ కిలోలకు పెరగటం కారణంగా మనం పొగాకు ఉత్పత్తిని తక్కువ విస్తీర్ణంలో నాణ్యమైన పొగాకు ఉత్పత్తి చేసుకోవాలన్నారు. ప్రధానంగా బ్రెజిల్, జింబాంబ్వే, చైనాదేశాల్లో అధికంగా పొగాకు ఉత్పత్తి అవుతుందన్నారు. ప్రస్తుతం మన రైతులు పండించిన లోగ్రేడ్ పొగాకుకు మంచిధర లభించటం లేదన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని పొగాకు పండించేరైతులు పంట నియంత్రణ పాటించి నాణ్యమైన పొగాకును పండించాలన్నారు. కార్యక్రమంలో దేవరపల్లి పొగాకు వేలం నిర్వహణాధికారి హేమస్మిత, ఐటీసీ ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, పీఎస్ఎస్ కంపెనీ ప్రతినిధి సీతారామరాజు, గౌతం, ఫీల్డ్‌ఆఫీసర్లు, రైతులు కరుటూరి శ్రీనివాస్, ఆచంట గోపాలకృష్ణ, యద్దనపూడి రవీంద్ర, సుంకవల్లి రాము, ఆచంట సత్యనారాయణ, కుసులూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : మంత్రి



శింగవరంలో వరి కోతను పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. శింగవరంలో వరిపంట కోత, నూర్పి డి,ధాన్యం తూర్పార పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన అందిస్తోందన్నారు. రబీలో ధాన్యం సేకరణకు సంబంధించి సకా లంలో సొమ్ములు జమ చేస్తామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు రైతు పక్షపాతి అని, వారికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు.

● శెట్టిపేటలో సమస్యల పరిష్కారానికి హామీ

శెట్టిపేటలో పర్యటించిన మంత్రి దృష్టికి గ్రామస్థులు పలు సమస్యలను తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఆసుపత్రిని, డ్వాక్రా భవనాన్ని సందర్శించి త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు, జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

● సీఐటీయూ కార్యదర్శి ఎస్.భగత్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.భగత్

దేవరపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని మండల సీఐటీయూ కార్యదర్శి ఎస్. భగత్ డిమాండ్ చేశారు. దేవరపల్లిలో సీఐటీయూ మండల మహాసభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా భగత్ మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు కావడం లేదని, చాలీచాలని జీతాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. దీంతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు ఎం. సుందరబాబు, లక్ష్మీ, తొర్లపాటి ఇందిర, రావి స్వరూప, అయినపర్తి శ్రీనివాసరావు, మర్రి రమేశ్, దుగ్గిన మాణిక్యం, గేలం సత్య నారాయణ, వజ్రం పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో మండల స్థాయి క్రీడలు ప్రారంభం



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జీడీ హైస్కూల్లో గురువారం మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభమైనట్టు ప్రధానోపాధ్యాయుడు పీ. రామకృష్ణ చెప్పారు. మండలంలోని అన్ని హైస్కూళ్ల నుంచి సుమారు 200 మంది విద్యార్థులు గురువారం ప్రారంభమైన ఈ పోటీల్లో పాల్గొన్నట్టు తెలిపారు. అథ్లెటిక్స్, చెస్, యోగా పోటీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు సక్సేనరాజు, శారదజ్యోత్స వ్యాయామ ఉపాధ్యాయులు బీ. స్వామి, కే. సంధ్యారాణి, గ్రామపెద్దలు కుదప చక్రపాణి, బూరుగుపల్లి మోహన్, పాఠశాలలకు చెందిన పీఈటీలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.